అలాంటి సినిమాలే నాకు ఇష్టం..

గేరు మార్చాలి అంటున్న రాశీఖన్నా

8 లో..

తెలుగు దినపత్రిక

RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

ఇదండీ..కబురు..






సంపుటి : 23 సంచిక : 47 | గురువారం జనవరి 30 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5




## పంచాయతీల్లో బీసీలకు 42% సీట్లు ?

# అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టే చాన్స్ !

- ఫిబ్రవరి 2 నాటికి సబ్ కమిటీకి కులగణన రిపోర్టు
- ఆ వెంటనే క్యాబినెట్ కు నివేదిక
- అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టే చాన్స్
- ముమ్మరంగా కసరత్తు చేస్తున్న సర్కారు

కబురు,హైదరాబాద్ జనవరి 29:

పంచాయతీ ఎన్నికలకు సర్కారు కసర్తత్తును ముమ్మరం చేసింది. ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. అయితే కులగణనకు సంబంధించిన నివేదిక ఇప్పటికే పూర్తయిందని తెలుస్తోంది. ఈ లెక్కన బీసీలకు 42 శాతం సీట్లు రిజర్వ్ అయ్యే అవకాశం ఉందని సమాచారం. సమగ్ర కులగణనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ స్థాయిలో తెలంగాణ నిర్వహించిన సమగ్ర కులగణన సర్వే ప్రశంసలందుకుందని సీఎం చెప్పారు. సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులకు సీఎం అభినందనలు తెలిపారు.సర్వేకు సంబంధించిన ముసాయిదా నివేదిక సిద్ధమైందని, ఫిబ్రవరి 2వ తేదీ నాటికి కేబినెట్ సబ్ కమిటీకి సమర్పిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సమావేశానికి రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### ఫిబ్రవరిలో ఎన్నికలు

ఫిబ్రవరి 2 తరువాత ఇప్పటికే పంచాయితీల్లో గతేడాది 2024, ఫిబ్రవరి1న సర్పంచ్ పదవీకాలం ముగియగా.. ప్రత్యేక అధికార పాలన వచ్చింది. రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే 15 రోజుల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధంగా ఉంది. ఈ మేరకు ఓటర్ల జాబితాలను సైతం సిద్ధం చేసిన విషయం తెలిసిందే. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఉన్నాయి. దీంతో పల్లెలకు కేంద్రం నుంచి గ్రాంట్లు రావడం లేదు. త్వరగా ఎలక్షన్లు నిర్వహిస్తే కేంద్రం నిధులు వస్తాయి.


మిగతాద్ది 2 లో




# లైట్ తీస్కోండి.. అవిశ్వాసం టెక్నికల్ గా సాధ్యం కాదు

కబురు,హైదరాబాద్ జనవరి 29:

జీహెచ్ఎంసీ మేయర్ పై అవిశ్వాస తీర్మానం టెక్నికల్-గా సాధ్యమయ్యే అంశం కాదని.. దాన్ని పట్టించుకోవద్దని కాంగ్రెస్ కార్పొరేటర్లకు మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు సూచించారు. కౌన్సిల్ సమావేశం, మేయర్-పై బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానం పెట్టాలని యోచిస్తోన్నట్లు ప్రచారం జరుగుతోన్న నేపథ్యంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు, మేయర్ విజయలక్ష్మితో బుధవారం (జనవరి 29) హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి శ్రీధర్ బాబు మినిస్టర్ క్వార్టర్స్-లో భేటీ అయ్యారు.2025, జనవరి 30న జరగనున్న కౌన్సిల్ మీటింగ్-లో అనుసరించాల్సిన వ్యూహాలు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం అంశాన్ని తీసుకొస్తే ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై చర్చించారు. కౌన్సిల్-లో అనుసరించాల్సిన వ్యూహాలపై కార్పొరేటర్లకు మంత్రులు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గ్రేటర్-లో జరిగిన అభివృద్ధి, కేటాయించిన నిధుల అంశాలపై కౌన్సిల్-లో చర్చించాలని కార్పొరేటర్లకు సూచించారు.కౌన్సిల్-లో కాంగ్రెస్ కార్పొరేటర్లు అంతా ఏకతాటిపై ఉండి ప్రతి పక్షాలకు కౌంటర్లు ఇవ్వాలని చెప్పారు. రేపు (గురువారం) కౌన్సిల్ భేటీ ప్రారంభానికి ముందు ఉదయం 8 గంటలకు మినిస్టర్ క్వార్టర్స్-లోని మంత్రి పొన్నం ఇంట్లో గ్రేటర్ పరిధిలోని కాంగ్రెస్ కార్పొరేటర్లతో మరోసారి భేటీ కానున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, గ్రేటర్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలు, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు సమ్మర్ స్పెషల్ డ్రైవ్..



రాబోయే వేసవిలో ప్రజలకు నీటి కష్టాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశించారు. ఇవాళ హైదరాబాద్‌లో మిషన్ భగీరథ పై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు సమ్మర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, వచ్చే 5 నెలల కోసం ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి మనిషికి 100 లీటర్ల నీటిని ప్రతిరోజు అందించేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీళ్లపై నమ్మకం కలిగించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు.

## రైతులపై బిఆర్ఎస్ మొసలి కన్నీరు



- గతంలో రుణమాఫీ పేరుతో మోసం
- రైతులపై రూ.11,145 కోట్ల మేర వడ్డీ భారం
- బడ్జెట్‌లో రూ.72 వేల కోట్ల నిధులు కేటాయించాం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

కబురు,హైదరాబాద్ జనవరి 29:

రైతులకు సంబంధించి బిఆర్ఎస్‌కు ఏనాడు చిత్తశుద్ధి లేదని, గతంలో వారు చేసిన రుణమాఫీ వ్యవహారమే ఇందుకు నిరదర్శనమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.


2 లో




# ఆన్‌లైన్ మోసల గుట్టురట్టు

- 8 రాష్ట్రాల్లో ఆపరేషన్‌తో బట్టబయలు
- దేశవ్యాప్తంగా మొత్తం 576 కేసులు నమోదు
- తెలంగాణలో 74 .. హైదరాబాద్‌లో 33 కేసులు
- మొత్తం రూ. 2.87 కోట్లు ఫ్రీజ్ చేసిన పోలీసులు
- కొన్ని కేసుల్లో బ్యాంకు ఉద్యోగులే నిందితులు
- వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్ సివి ఆనంద్

కబురు,హైదరాబాద్ జనవరి 29:

అమాయకులను టార్గెట్ చేసుకుని ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న ముఠా గుట్టను హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు రట్టు చేశారు. అందుకు సంబంధించి ఎనిమిది రాష్ట్రాల్లో ఈ ఆపరేషన్ జరిగిందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు.

బుధవారం హైదరాబాద్‌లో సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మొత్తం 576 కేసులు నమోదు కాగా.. వాటిలో తెలంగాణలో 74 కేసులు.. హైదరాబాద్‌లో 33 కేసులు నమోదు అయినట్లు వివరించారు. ఈ ఆన్‌లైన్ మోసాల కారణంగా.. రూ. 88.3 కోట్ల మేర బాధితులకు నష్టం వాటిల్లిందని చెప్పారు. అయితే ఈ కేసుల్లో మొత్తం రూ. 2.87 కోట్లు ఫ్రీజ్ చేశామని వెల్లడించారు.


2లో..


## కేటీఆర్, హరీశ్‌రావు నా కాలిగోటికి కూడా సరితూగరు



- ప్రతిపక్ష హోదా కోసం కేటీఆర్, హరీశ్‌రావుల మధ్య విభేదాలు
- పనికిరాని మాటలు మాట్లాడితే సహించను

: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కబురు,హైదరాబాద్ జనవరి 29:


2 లో


# ఇస్రో వందో రాకెట్ ప్రయోగం





## దేశానికి గొప్ప విజయం : హరీశ్‌రావు

కబురు,హైదరాబాద్ జనవరి 29:

ఇస్రో వందో ప్రయోగం విజయవంతంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో వందో రాకెట్ ప్రయోగం భారతదేశానికి ఒక గొప్ప విజయమని ప్రశంసించారు. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్.. ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిందని తెలిపారు. ఎన్వీఎస్-02 ఇస్రో శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ అని.. దీంతో మన సైంటిస్టుల ప్రతిభ అని పేర్కొన్నారు. దేశానికి గర్వకారణమైన రోజు ఇవాళ అని హరీశ్‌రావు ప్రశంసించారు. భారత నావిగేషన్ వ్యవస్థ నావిక్ సిరీస్‌లోని ఈ రెండో ఉపగ్రహం కచ్చితమైన పొజిషన్, వేగం, టైమింగ్‌తో భారత ఉపఖండం అవతల 1500 కి.మీ పరిధి వరకు యూజర్లకు కచ్చితమైన గమన సూచనలు(నావిగేషన్, ముఖ్యంగా నౌకాయానం) అందిస్తుంది.


మిగతాది 2లో


# మహాకుంభమేళాలో భారీ విషాదం

- తొక్కిసలాటలో కనీసం 20మంది మృత్యువాత
- మౌని అమావాస్యతో భారీగా తరలివచ్చిన భక్తులు
- చీకట్లో ఎటు వెళ్లాల్లో తెలియక గందరగోళంతో ఘటన
- భారీ చెత్తడబ్బాలు కూడా కారణమంటున్న సాక్షులు
- తక్షణం స్పందించిన యూపి ప్రభుత్వం
- అంబులెన్సుల్లో హుటాహుటిన క్షతగాత్రుల తరలింపు





కబురు,ప్రయాగ్‌రాజ్,జనవరి 29:

గత పక్షంరోజులుగా కోట్లాది మంది వచ్చినా..సాఫీగా సాగిన మహాకుంభమేళాలో అపశృతి చోటుచేసుకున్నది. మౌనా అమావాస్య సందర్భంగా అమృత స్నానంలో పాల్గొనేందుకు లక్షల సంఖ్యలో భక్తులు త్రివేణి సంగమంకు చేరుకున్న వేళ తొక్కిసలాట చోటు చేసుకుంది. బుధవారం ఇవాళ తెల్లవారుజామున 3 గంటల సమయంలో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఆ తొక్కిసలాటలో 20మంది మృతిచెందారని ప్రాథమిక సమచారం. మరో 50 మందికిపైగా గాయపడినట్లు తెలుస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లోని స్వరూపరాణి ఆస్పత్రికి మృతదేహాలను తరలించారు. అక్కడ పోస్టు మార్టం నిర్వహించిన తరవాత మృతదేహాలను బంధువులకు అప్పగించనున్నారు. తొక్కిసలాట వల్ల 13 అకాడాలు అమృత స్నానం రద్దు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వాళ్లు ప్రకటన జారీ చేశారు. త్రివేణి సంగమంలో తొక్కిసలాట జరిగిన ప్రదేశానికి ఉదయం సుమారు 70 అంబులెన్సులు చేరుకున్నాయి. దాదాపు మూడు గంటల పాటు తరలింపు ప్రక్రియ జరిగింది. అమావాస్య రోజున స్నానం చేయాలన్న ఉద్దేశంతో.. కోట్ల సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నారు. అధికారులు అంచనా ప్రకారం.. ఇప్పటికే 5 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్ పరిసరాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు సాయంత్రం వరకు ఆ సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి.


02

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# ప్రయోగాత్మక పౌరస్మృతి



దేశంలో తొలిసారిగా ఒక రాష్ట్రం ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలుకు శ్రీకారం చుట్టింది. గత ఏడాది ఫిబ్రవరిలో చట్టసభ ఆమోదించిన యూసీసీని ఉత్తరాఖండ్ ఆచరణలోకి తెచ్చింది. ఆ రాష్ట్ర సీఎం సోమవారం డెహ్రాడూన్‌లో యూసీసీ నియమావళి ప్రకటించి, పోర్టల్‌ను ప్రారంభించడంతో కొత్త కథ మొదలైంది. వివాదాస్పద యూసీసీ అమలు ‘దేవభూమి’ నుంచి ఆరంభమైందన్న మాటే కానీ, వివాదాల పెనుభూతం మాత్రం ఇప్పుడప్పుడే వదిలిపెట్టడం కష్టం. ఇదంతా చూపులకు... మతాలకు అతీతంగా అందరికీ ఒకే విధమైన వ్యక్తిగత చట్టాలుండేలా ప్రమాణీకరించే ఉద్దేశంతో చేపట్టిన ప్రయత్నంగా, సమానత్వం – సమన్యాయ సిద్ధాంతాలకు అనుగుణంగా గొప్పగా అనిపించవచ్చు. ఆధునిక విలువలకూ, లైంగిక సమానత్వ – న్యాయాలకూ జై కొట్టినట్టు కనిపించవచ్చు. కానీ, లోతుల్లోకి వెళితే – ఆచరణలో ఇది కీలకాంశాలను అందిపుచ్చుకోలేదు. అనేక లోటుపాట్లూ వెక్కిరిస్తాయి. ముఖ్యంగా... చట్టసభలో సమగ్ర చర్చ లేకుండానే, ఏకాభిప్రాయం సాధించకుండానే హడావిడిగా యూసీసీ తేవడం బీజేపీ పాలకుల తెర వెనుక ఉద్దేశాలకు ప్రతీకగా కనిపిస్తుంది. ఉత్తరాఖండ్‌లో ఇకపై పెళ్ళిళ్ళు, విడిపోవడాలు, భరణాలు లాంటివన్నిటికీ అన్ని మతాలకూ ఒకే చట్టం వర్తించనుంది. ఆ రాష్ట్రంలో పెళ్ళిళ్ళ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. చేయకపోతే, జరిమానాతో పాటు, వివాహాల రిజిస్ట్రేషన్ కానివారు ప్రభుత్వ ప్రయోజనాలకు పూర్తిగా అనర్హులు. అలాగే, విడాకుల కేసుల్లో భార్యాభర్తలకు ఒకే నియమావళి వర్తిస్తుంది. బహుభార్యాత్వంపై నిషేధమూ విధించారు.అదే సమయంలో, భిన్న సంస్కృతి, సంప్రదాయాలను అంటిపెట్టుకొని ఉండే షెడ్యూల్డ్ ట్రైబ్‌లను మాత్రం నిషేధం నుంచి మినహాయించారు. ప్రభుత్వ కొత్త ప్రతిపాదనలో కొన్ని అంశాలు నైతిక నిఘా అనిపిస్తున్నాయి. పెళ్ళి చేసుకున్నవారే కాదు, సహజీవనం చేస్తున్నవారూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనడం, అలా చేయకపోతే జైలుశిక్ష, జరిమానా అనడం బలవంతంగా అందరినీ దారికి తెచ్చుకోవడమే తప్ప, న్యాయపరిరక్షణ అనుకోలేం. అసలు విభిన్న మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలకు నెలవైన మన దేశంలో పెళ్ళి, విడాకులు, దత్తత, వారసత్వం, పిత్రార్జితం లాంటి అంశాల్లో అందరినీ ఒకే తాటిపైకి తీసుకు రావాలని సమష్టి వ్యక్తిగత చట్టాలు చేయడం సరైనదేనా అన్నది మౌలికమైన ప్రశ్న. ఎవరి మత ధర్మం వారికి ఉండగా, అందరినీ ఒకే గాటన కట్టి, మూకుమ్మడి పౌరస్మృతిని బలవంతాన రుద్దడ మేమిటని జమైత్ ఉలేమా ఇ–హింద్ లాంటివి అభ్యంతరం చెబుతున్నాయి. షరియాకూ, మతానికీ విరుద్ధమైన చట్టాన్ని ముస్లిమ్‌లు ఆమోదించలేరని కుండబద్దలు కొడుతున్నాయి. ఇలా ఉత్తరాఖండ్ యూసీసీపై ఒకపక్క దేశవ్యాప్తంగా వాడివేడి చర్చలు జరుగుతుండగానే, మరోపక్క గౌరవ ఉపరాష్ట్రపతి హోదాలోని వారు మాత్రం ‘ఇలాంటి చట్టం దేశమంతటా త్వరలోనే రావడం ఖాయమ’ని ఢంకా బజాయించడం విడ్డూరం. నిజానికి, ఉత్తరాఖండ్ యూసీసీలో లోటుపాట్లకు కొదవ లేదు. అందరూ సమానమే అంటున్నా, స్వలింగ వివాహాల ప్రస్తావన లేదేమని కొందరి విమర్శ. అలాగే, దత్తత చట్టాలపైనా యూసీసీ నోరు మెదపలేదని మరో నింద. అందరూ సమానం అంటూనే కొందర్ని కొన్ని నిబంధనల నుంచి మినహాయించడమేమిటని ప్రశ్న. ఎస్టీలకు సహేతుకంగా వర్తించే అదే మినహాయింపులు ఇతర వర్గాలకూ వర్తించాలిగా అన్న దానికి జవాబు లేదు. 44వ రాజ్యాంగం అధికరణం యూసీసీని ప్రస్తావించిందన్నది నిజమే. దీర్ఘకాలంగా యూసీసీపై అందరూ మాట్లాడుతున్నదీ నిజమే. కానీ, అది ఏ రకంగా ఉండాలి, లేదా ఉండకూడదన్న దానిపై ఇప్పటికీ ఎవరికీ స్పష్టత లేదు. పైగా, గందరగోళమే ఉందన్నదీ అంతే నిజం. ఆది నుంచి ఉమ్మడి పౌరస్మృతిని తారకనామంగా జపిస్తున్న కమలనాథులు ఇప్పుడు ఉత్తరాఖండ్‌లో ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నారనుకోవాలి. యూసీసీ వల్ల జరిగే మంచి మాట దేవుడెరుగు, అసలిది చేయగలిగిన పనే అని ప్రపంచానికి చాటాలనుకున్నారు. అయితే, ఈ ఉత్తరాఖండ్ యూసీసీ రాజ్యాంగబద్ధత పైనా సందేహాలున్నాయి. ఒక రాష్ట్ర చట్టసభలో చేసిన చట్టాలు ఆ రాష్ట్ర పరిధికే వర్తిస్తాయని 245వ రాజ్యాంగ అధికరణ ఉవాచ. కానీ, రాష్ట్రం వెలుపల ఉన్న ఉత్తరాఖండీయులకూ యూసీసీ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఇది హాస్యాస్పదం. అలాగే, సహజీవనాల రిజిస్ట్రేషన్ తప్పదంటున్నారే తప్ప, అలా చేసుకుంటే చట్టపరంగా ఆ భాగస్వాముల పరస్పర హక్కులకు రక్షణ లాంటివేమీ కల్పించ లేదు. వారి ప్రైవేట్ బతుకులు వ్యవస్థలో నమోదై నడిబజారులో నిలవడమే తప్ప, నిజమైన ప్రయో జనమూ లేదు. పైగా 21వ అధికరణమిచ్చిన గోప్యత హక్కుకు విఘాతమే! నిజానికి, గోప్యత హక్కులో సమాచార గోప్యత, స్వతంత్ర నిర్ణయాధికారం కూడా ఉన్నాయని జస్టిస్ పుట్టస్వామి కేసులో తొమ్మండుగురు న్యాయమూర్తుల సుప్రీమ్ కోర్ట్ ధర్మాసనం ఏనాడో తేల్చి చెప్పింది. ఇప్పుడీ యూసీసీ నిబంధన అచ్చంగా దానికి విరుద్ధమే. అలాగే, కులాంతర, మతాంతర వివాహాలపై విచ్చుకత్తులతో విరుచుకుపడి, ప్రాణాలు తీసే స్వభావం నేటికీ మారని సమాజంలో ఈ తరహా నిబంధనలు ఏ వెలుగులకు దారి తీస్తాయి? వెరసి, ఉత్తరాఖండ్ సర్కారు వారి యూసీసీ పైకి పెను సంస్కరణగా కనిపించినా, ఆఖరికి వేర్వేరు చట్టాల్లోని అంశాల్ని అనాలోచితంగా కాపీ చేసి అతికించిన అతుకుల బొంతగా మిగిలింది. ఇది ఏకరూపత పేరిట ప్రభుత్వం బల ప్రయోగం చేయడమే అవుతుంది. ఉత్తరాఖండ్ బాటలోనే ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలూ పయనించి, ఆఖరికి యూసీసీని దేశవ్యాప్తం చేస్తారన్న మాట వినిపిస్తున్నందున ఇకనైనా అర్థవంతమైన చర్చ అవసరం.

# మహాకుంభమేళాలో భారీ విషాదం

మొదటిపేజీ తరువాయి

మౌని అమావాస్య కారణంగా నెలకొన్న రద్దీతో తొక్కిసలాట ఘటన చోటుచేసుకొని పదుల సంఖ్యలో భక్తులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. అనేకమంది గాయపడ్డారు. ఆ భయానక క్షణాలను కొంతమంది ప్రత్యక్ష సాక్షులు మీడియాతో పంచుకున్నారు. విపరీతమైన రద్దీ వల్ల ఎటు వెళ్లాలో తెలియక గందరగోళ పరిస్థితి నెలకొందని తెలిపారు. చీకట్లో కన్పించని చెత్త బుట్టలు కాళ్లకు తగలడంతో చాలామంది కింద పడిపోయారని పేర్కొన్నారు. ‘తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మౌని అమావాస్య నేపథ్యంలో త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు చేసేందుకు ఒక్కసారిగా భక్తులు బయల్దేరారు. తలపై పెద్దపెద్ద లగేజీలతో భక్తులు తరలివచ్చారు. అయితే, ఎటునుంచి వెళ్లాలి.. ఎక్కడ స్నానమాచరించాలన్న దానిపై ఎవరికీ అవగాహన లేదు. పైగా.. యాత్రికుల కోసం ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో ఇనుప చెత్త డబ్బాలను ఏర్పాటుచేశారు. చిమ్మచీకట్లో అవి ఎవరికీ కన్పించలేదు. దీంతో వాటికి తగిలి చాలామంది కింద పడిపోయారు. ఈ క్రమంలోనే తొక్కిసలాట జరిగింది‘ అని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. చెత్త డబ్బా తగిలి తాను కూడా కింద పడిపోయాయని, ఎలాగోలా అక్కడినుంచి కుటుంబంతో బయటపడ్డానని చెప్పారు. వేరే భక్తులను కాపాడే క్రమంలో స్వల్పంగా గాయపడినట్లు వివరించారు. మరో ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ.. ‘ఈ ప్రాంతం నుంచి బయటకు వెళ్లే మార్గాలు పూర్తిగా మూసుకుపోయాయి. దానివల్లే పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. చాలామంది మా కళ్ల ముందే కింద పడిపోయారని తెలిపారు. త్రివేణి సంగమానికి కిలోమీటరు దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. భక్తులంతా సంగమం ప్రధాన ఘాట్ వద్దే స్నానాలు చేసేందుకు యత్నించగా ఆ మార్గంలోని బారికేడ్లు విరిగి తొక్కిసలాట చోటుచేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అయితే, మృతుల సంఖ్యపై యూపీ సర్కారు ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. తొక్కిసలాట ఘటనతో త్రివేణి సంగమం వద్ద కొంతసేపు పుణ్య స్నానాలను నిలిపివేశారు. పరిస్థితి అదుపులోకి వచ్చిన తర్వాత పునరుద్ధరించారు. మౌని అమావాస్యను పురస్కరించుకొని భక్తులు పెద్దఎత్తున ప్రయాగ్‌రాజ్ కు చేరుకున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు దాదాపు 3 కోట్ల మంది పుణ్య స్నానమాచరించినట్లు అధికారులు తెలిపారు. 12 పూర్ణ కుంభమేళాలతో సమానమైన మహా కుంభమేళాను 144 ఏళ్లకోసారి నిర్వహిస్తారు. అందుకే ఈసారి భక్తుల తాకిడి విపరీతంగా ఉంది. జనవరి 13న మొదలైన ఈ మహా కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు కొనసాగనుంది. ఇప్పటివరకు 20 కోట్ల మందికి పైగా భక్తులు కుంభమేళాను దర్శించుకొని పుణ్య స్నానాలు ఆచరించారు.

# కేటీఆర్, హరీశ్‌రావు నా కాలిగోటికి కూడా సరితూగరు

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్‌రావులపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బుధవారం గాంధీభవన్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్, హరీష్ రావులు తన కాలి గోటికి కూడా సరిపోరని, కేటీఆర్ పనికిరాని వ్యక్తి అని, పనికి రాని మాటలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ ఉన్నరా.. బండి సంజయ్ ఉన్నరా.. అని ప్రశ్నించారు. గద్దర్‌కు అవార్డ్ ఇస్తే తప్పేంటని నిలదీశారు. కాంగ్రెస్ మీటింగ్‌లో పల్లీలు, ఐస్ క్రీంలు అమ్ముకునేంత మంది కూడా కేటీఆర్ మీటింగ్‌కు రాలేదని ఎద్దేవా చేశారు. నల్లగొండలో టీ హాబ్‌కు తాళం వేసిందే కేటీఆర్ అని అన్నారు. కేటీఆర్‌పై ఉన్న అవినీతి ఆరోపణలు తనపై లేవని అన్నారు. కేసీఆర్ లా తాను ఎలక్షన్, కలెక్షన్ చేయలేదన్నారు. ప్రతిపక్ష నేత పదవి కోసం హరీష్ రావు, కేటీఆర్ కత్తులతో పొడుచుకుంటున్నారన్నారు. ప్రతిపక్ష నేతగా భట్టి పాదయాత్ర చేసి, ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని, కేసీఆర్ బడ్జెట్ సెషన్‌కు వస్తారో.. రారో చెప్పాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. చాల రోజుల గ్యాప్ తర్వాత ముఖాముఖీ కార్యక్రమం జరుగుతోంది. ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల నుండి మంత్రి వినతి పత్రాలు స్వీకరిస్తున్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం గాంధీ భవన్‌కు చాలా మంది వస్తున్నారు. కాగా తెలుగు సినీ ఇండస్ట్రీకి తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం డబ్బింగ్ థియేటర్ నిర్వాహకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సినీ కళాకారులు, కార్మికుల శ్రేయస్సుకు నిరంతరం కృషి చేస్తున్నామని, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన వద్దకు వచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. దేశంలోనే తెలుగు సినీ పరిశ్రమకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని, వాటిని మరింతమెరుగుప్పుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. సినిమా ఇండస్ట్రీని మరింత విస్తరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. త్వరలోనే వాటి వివరాలను వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేంద్ర, సినీ నిర్మాతల మండలి ప్రెసిడెంట్ దామోదర్ ప్రసాద్, తెలంగాణ ఫిలిం ఛాంబర్ సెక్రటరీ అనుపమ రెడ్డి, ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్, నల్గొండ డీసీఎంఎస్ చైర్మన్ బొల్లా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇస్రో వందో రాకెట్ ప్రయోగం

మొదటిపేజీ తరువాయి

50.9 మీటర్ల పొడవైన రాకెట్ జీఎస్ఎల్వీ–ఎఫ్12 మిషన్‌లో ఎన్‌వీఎస్–01 ఉపగ్రహాన్ని గతేడాది మే 29 విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. నేడు నింగిలోకి దూసుకెళ్లిన 2,250 కిలోల బరువైన ఎన్‌వీఎస్–02 శాటిలైట్‌ను యూఆర్ శాటిలైట్ కేంద్రంలో రూపొందించి అభివృద్ధి పరిచారు. ఇందులో రేజింగ్ పేలోడ్‌కు అదనంగా ఎల్1, ఎల్5 నావిగేషన్ పేలోడ్లు ఉన్నాయి. ఈ ఉపగ్రహం అందించే నావిగేషన్ సమాచారాన్ని గగనతల, భూతల, జల మార్గాల్లో ఉపయోగించుకోవచ్చు. విమానాల నిర్వహణకు, మొబైల్స్‌లో స్థాన ఆధారిత సేవలకు, ఉపగ్రహాల కక్ష్య నిర్ధారణకు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత అప్లికేషన్లకు, ఈ ఉపగ్రహపు నావిగేషన్‌ను వాడుకోవచ్చని ఇస్రో తెలిపింది.

## రైతులపై బిఆర్ఎస్ మొసలి కన్నీరు

మొదటిపేజీ తరువాయి

ఇప్పుడు అది మరచి పోయి తమను విమర్శిస్తున్నారని మండిపడ్డారు.భూమికి, విత్తనానికి మధ్య ఎలాంటి బంధం ఉందో.. రైతులతో కాంగ్రెస్ పార్టీకి అలాంటి బంధమే ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గతంలో భారాస ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష రుణమాఫీని కూడా ఏకకాలంలో చేయలేదని.. తద్వారా రైతులపై రూ.11,145 కోట్ల మేర వడ్డీ భారం పడిందన్నారు. గతంలో నాట్లు వేసే సమయం కాదు.. కోతల సమయానికి కూడా రైతుబంధు అందించలేదని విమర్శించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని విశ్వసించే ప్రభుత్వం.. ప్రజా ప్రభుత్వం అని అన్నారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో రూ.72 వేల కోట్ల నిధులు వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేటాయించినట్లు తుమ్మల చెప్పారు. ‘పదేళ్ల భారాస పాలనలో తెలంగాణ రైతులు పడిన ఇబ్బందులు గమనించాం. వారి కన్నీరు తుడవడమే లక్ష్యంగా అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రైతు రుణమాఫీ చేశాం. వరికి బోనస్.. మా ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. సాగు చేసే రైతులకు నిజమైన భరోసా ఇవ్వాలనే లక్ష్యంతో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లాంటి పథకాలు ప్రారంభించాం. గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన వ్యవసాయ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నాం. రైతును రాజును చేసేందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంది. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని పేర్కొన్నారు.

## పంచాయతీల్లో బీసీలకు 42% సీట్లు ?

మొదటిపేజీ తరువాయి

ఫిబ్రవరి 2న కేబినెట్ సబ్ కమిటీకి రిపోర్టు అందితే.. ఆ నివేదికపై చర్చించేందుకు రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై దానిని ఆమోదిస్తుంది. తర్వాత బీసీ గణన కు సంబంధించిన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం ఉంటుంది. అదే సమయంలో ఎలాంటి అడ్డంకులు రాకుండా ఉండేందుకు న్యాయనిపుణులతో రివ్యూ చేయించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రకియను ఫిబ్రవరి రెండో వారంలోగా నిర్వహించాలని నెలాఖరులోగా పంచాయతీ ఎన్నికలు పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

## ఆన్‌లైన్ మోసల గుట్టురట్టు

మొదటిపేజీ తరువాయి

ఈ కేసులో ముగ్గురు కీలక సూత్రదారులు ఉన్నారన్నారు. ముంబైకి చెందిన చెందిన జూనైద్ నగదును.. క్రిప్టో కరెన్సికి మారుస్తున్నాడని వివరించారు. ఆ క్రమంలో డిజిటల్ అరెస్ట్ కేసులో ఇద్దరు వైద్యులు మోసపోయారని విశదీకరించారు. గుర్తు తెలియని యాప్స్, గ్రూప్స్‌లో చేరవద్దంటూ ప్రజలకు సీవీ ఆనంద్ సూచించారు. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్‌తో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఇక సైబర్ క్రైం విషయంలో అవగాన చాలా ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. చీఫ్ జస్టిస్ సుప్రీంకోర్టు పేరుతో ఫేక్ ఆర్డర్ తయారు చేశారన్నారు. అలాగే మీ కేసు క్లోజ్ చేస్తాం నగదు డిపాజిట్ చేయాలని డిమాండ్ చేయడంతో.. మూడు కోట్ల ఎఫ్‌డీలను నిందితులకు చెల్లించారని తెలిపారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇక ఈ వ్యవహారంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో సైతం సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశానికి అన్ని బ్యాంకులకు సంబంధించిన ఉన్నతాధికారులు సైతం హాజరయ్యారని వివరించారు. అయితే సైబర్ క్రైం అరికట్టడంలో కీలక పాత్ర పోషించాలని బ్యాంకు ఆధికారులకు ఆయన సూచించారు. దీనిపై ఓ కమిటీ ఏర్పాటు చేశామని.. ఆ నివేదిక అందజేసిన వెంటనే చర్యలు చేపడతామని సీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ఇక నిందితులు మూడు రకాల సైబర్ క్రైమ్‌కు పాల్పడ్డారని వివరించారు. ఇందులో 52 మంది నిందితుల ప్రమేయం ఉందన్నారు. అలాగే ముగ్గురు బ్యాంక్ ఉద్యోగులను సైతం అరెస్ట్ చేశామని చెప్పారు. ఫేస్ బుక్ బ్రౌజింగ్‌తోపాటు వాట్సప్ గ్రూప్ ద్వారా నిందితులు ఆకర్షిస్తున్నారన్నారు. వ్యక్తిని లక్ష్యంగా చేసుకొని రూ. 93 లక్షల ట్రేడింగ్ ఫ్రాడ్ చేశారన్నారు. మరో బాధితుడు అయితే.. రూ. 2.06 లక్షల మేర విడతల వారీగా నగదు కోల్పోయాడన్నారు. అనీషా యాప్ ద్వారా వాట్సప్ గ్రూప్‌లో ఇన్వెస్ట్ చేసి మోసపోయాడరన్నారు. మ్యూల్ అకౌంట్ ఓపెన్ చేసి.. బ్యాంకు అధికారుల సహకారంతో ఫ్రాడ్ చేస్తున్నారని చప్పారు. విద్యావంతులు సైతం మోసపోతున్నారని చెప్పారు. గతేడాది రూ. 3, 500 కోట్లు సైబర్ క్రైమ్ ద్వారా మోసం జరిగిందని వివరించారు. అయితే ఈ కేసుల్లో కేవలం 13 శాతం మేరకే రికవరీ అయిందన్నారు. సైబర్ క్రైమ్‌లో నగదు రికవరీ కావడం చాలా కష్టమన్నారు. అయితే ఈ మోసాలపై అవగాహనం చాలా ముఖ్యమన్నారు. నిందితులు ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన వ్యక్తులు కావడంతో..ఈ కేసులు దర్యాప్తు చేయడం చాలా కష్టతరంగా మారుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.


## విదేశీ అమ్మాయిలతో వ్యభిచారం

### – దాడి చేసి పట్టుకున్న ఎస్‌వోటి పోలీసులు

**హైదరాబాద్,జనవరి29**

హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలో సెక్స్ రాకెట్ గుట్టు రట్టు అయ్యింది. గౌలిదొడ్డి టీఎన్జీఓస్ కాలనీలో ఓ యువకుడు.. ఫారిన్ అమ్మాయిలతో వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. కెన్యా, టాంజానియా, బ్యాంకాక్ అమ్మాయిలతో వ్యభిచారం నడుపుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేశారు. కాలనీలోని వ్యభిచార గృహంపై మాదాపూర్ ఎస్ఓటీ, హెచ్ టీఎఫ్ అధికారులు కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించి.. 9 మంది ఫారిన్ అమ్మాయిలను అదుపులోకి తీసుకున్నారు.విషయం తెలుసుకున్న నిర్వాహకుడు పోలీసులకు దొరకకుండా పరారయ్యాడు. దీంతో పోలసులు అతడి కోసం గాలింపు చర్యలు చేప్టటారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అక్రమంగా భూమి కబ్జా చేశారని సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన బాధితురాలు



**కబురు న్యూస్ బాన్సువాడ జనవరి 29**
బాన్సువాడ పట్టణ శివారులోని వారాంతపు సంత సమీపంలో 787/2 సర్వే నంబర్లు ఒక ఎకరం 20 గుంటల భూమి కబ్జా చేశారని బాధితురాలు ఓట్లంగారి నాగవ్వ బుధవారం సబ్ కలెక్టర్ కిరణ్మయికి ఫిర్యాదు చేశారు. కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తన భూమిని తనకు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు శంకర్ గౌడ్,కోణాల గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# బాన్సువాడలో ఆస్పత్రి ముందు ధర్నా చేపట్టిన కార్మికులు



**కబురు న్యూస్ బాన్సువాడ జనవరి 29**
బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్, పేషంట్ కేర్ కార్మికులకు నాలుగు నెలల బకాయి వేతనాలను చెల్లించాలని కోరుతూ బుధవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో మాతా శిశు ఆసుపత్రి ముందు కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్ రాములు మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో వేతనాలు అందక కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కార్మికులకు పని ఒత్తిడి తగ్గించి ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు అందేలా చూడాలని లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు సంతోష్ గౌడ్, రేణుక, సురేఖ, జైల్ సింగ్ ,సంగీత, గంగారం, సుశీల కాశీరాం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులు అందజేయాలని తహసిల్దార్ కు వినతి




**కబురు న్యూస్ బీర్కూర్ జనవరి 29**
అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం బిజెపి అధ్యక్షుడు సాయికిరణ్ ఆధ్వర్యంలో తహసిల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సాయికిరణ్, యోగేష్, సాయిబాబా బసవరాజ్, గజేందర్, శ్రీనివాస్ ,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో మెడికల్ విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ తనిఖీలు

## 8 మంది ఆర్ఎంపీ, పీఎంపీలపై కేసులు...

**కబురు న్యూస్,నిజామాబాద్ జనవరి 29 :**
నిజామాబాద్ జిల్లాలో మెడికల్ విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ తనిఖీలు చేపట్టి 8 మంది ఆర్ఎంపీ, పీఎంపీలపై కేసులు నమోదు చేసినట్లు నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి తెలిపారు.నిజామాబాద్ సబ్ డివిజన్ పరిధిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మెడికల్ విజిలెన్స్,ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు తనిఖీలు చేశారని, ఏసీపీ తెలిపారు.వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎలాంటి అర్హతలు లేకున్నా అల్లోపతి వైద్యం చేస్తూ మందులు రాస్తున్న 8 మంది ఆర్ఎంపీ,పీఎంపీలపై కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు.ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో కె.గంగాధర్, డిచ్ పల్లి ఏరియాలో రాజేంధర్, మిట్టాపల్లిలో మద్రి వెంకటేశ్వర్, డిచ్ పల్లి(ఎం) ఆర్ఎంపీ వైద్యుడు దత్తాద్రి,ఆర్మూర్ రోడ్డులోని గోలి సందీప్ లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నిజామాబాద్ నగరంలోని 5వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లేశం, మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విఠల్ సింగ్,సూర్ మహేష్ కుమార్ లపై కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు.

# ఏసీబీకి చిక్కిన లింగంపేట్ ఎస్సై

**కబురు న్యూస్,కామారెడ్డి, జనవరి 29 :**
కామారెడ్డి జిల్లా లింగంపేట్ ఎస్సై లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు చిక్కారు.నిజామాబాద్ జిల్లా కేంద్రంలో లింగంపేట్ ఎస్సై కంది సుధాకర్ బాధితుడు తులసి వెంకట నర్సింలు అనే వ్యక్తి వద్ద రూ.12,500 లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖాధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.నిజామాబాద్ ఏసీపీ డీఎస్పీ శేఖర్ గౌడ్ కథనం ప్రకారం నిజామాబాద్ నగరంలోని వినాయక్ నగర్ కు చెందిన తులసి వెంకట నర్సింలు అనే వ్యక్తి 2010 మోడల్ కు చెందిన షిఫ్ట్ కారును నవీన్ గౌడ్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేశాడు.దానిని అతను నాగారంకు చెందిన చిరంజీవికి



విక్రయించాడు.చిరంజీవి కొన్ని నెలల పాటు కిస్తీలు చెల్లించిన తర్వాత వాటిని చెల్లించే స్థోమత లేక ఆర్మూర్ కు చెందిన వ్యక్తి వద్ద తాకట్టుపెట్టాడు.ఈ విషయంలో లింగంపేట్ ఎస్సై సుధాకర్ వెంకటనర్సింలుకు ఫోన్ చేసి ముందుగా కారు కొన్నది నీవే కాబట్టి కారును తీసుకురావాలని చెప్పడంతో వెంకట నర్సింలు చివరకు సంబంధిత కారును లింగంపేట్ పోలీస్ స్టేషన్ లో అప్పగించారు.అయితే ఈ నెల 22న పోలీస్ స్టేషన్ కు వెంకట నర్సింలును రప్పించిన ఎస్సై అతన్ని లాకప్ లో ఆరు గంటలు నిర్బంధించాడు.తర్వాత రూ.20 వేలు లంచం ఇస్తేనే కేసు పెట్టనని బేరాలకు దిగాడు.చివరకు వెంకట నర్సింలు రూ.12,500 ఇస్తానని ఒప్పుకుని ఏసీబీని ఆశ్రయించాడు.దీంతో బుధవారం నిజామాబాద్ నగరంలోని వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద టీఎస్ 16 ఎఫ్ బి 8794 కారులో వచ్చిన కామారెడ్డి జిల్లా లింగంపేట పోలీస్ స్టేషన్ ఎస్సై కంది సుధాకర్ రూ.12,500లను లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.సుధాకర్ ను విచారించి కేసు నమోదు చేసి నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చుతున్నట్లు డీఎస్పీ శేఖర్ గౌడ్ తెలిపారు.

# డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు

- హెల్మెట్ లేకుండా తల్లిదండ్రులను బయటకు వెళ్ళనీయద్దు...
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి...

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,జనవరి 29 :**

జాతీయరోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని శ్రీరామ గార్డెన్ లో సుమారుగా 2 వేల మంది విద్యార్థిని విద్యార్థులతో భారీ ర్యాలీని నిర్వహించారు.విద్యార్థిని విద్యార్థులతో రోడ్డు భద్రత నినాదాలు ఇప్పించి, ప్రజలు చైతన్యవంతులు చేస్తూ ర్యాలీ ఉత్సాహంగా కదిలారు.ఈ కార్యక్రమం రోడ్డు రవాణా,ట్రాఫిక్,ట్రస్మా నిజామాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు.నగరంలోని శ్రీరామ గార్డెన్ లో నిర్వహించిన సమావేశంలో విద్యార్థిని విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.ఈ




కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అంకిత్ కుమార్,రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి,జిల్లా జడ్జి సునీత కుంచాల, డిసిపి బస్వా రెడ్డి, డిటిసి దుర్గా ప్రమీల, డిటిఓ ఉమామహేశ్వరరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఎలాంటి బైకులు నడప రాదని,తల్లిదండ్రులని హెల్మెట్ లేకుండా బయటకు వెళ్ళనీయద్దని పిల్లలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్టిఏ రాజా నరేందర్ గౌడ్, ఏసిపి ట్రాఫిక్ నారాయణ, ఎస్ వి ఐ కిరణ్



కుమార్,వివేకానందరెడ్డి,డి శ్రీనివాస్,రాహుల్,ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్,నిజామాబాద్, బోధన్,ప్రైవేటు పాఠశాలల విద్యాసంస్థల కరస్పాండెంట్లు,60 పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్ కళాబృందం వారు ప్రదర్శించిన లఘునాటిక,విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం అందరిని అలరించి,ఆలోచింపజేశాయి.

# అత్యంత వైభవంగా శ్రీ చక్రేశ్వర శివ మందిర 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...

**కబురు న్యూస్,బోధన్ జనవరి 29..**
బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివ మందిర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ చక్రేశ్వర శివ మందిరం ఆలయ 66వ ఆవిర్భావం దినోత్సవం, మౌని అమావాస్య సందర్భంగా బుధవారం వేకువ జాము నుండి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు గణేష్ మహారాజ్ వేద మంత్రోచ్చారణాల నడుమ హెూమం, అభిషేకాలు, అర్చనలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ





సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



ఆలయ కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, ఈవో రవీందర్ గుప్తా, అయ్యప్ప ఆలయం అర్చకులు సంతోష్ శర్మ, అర్చకులు శివకుమార్, మహేష్, భక్తులు, మహిళలు ఉన్నారు.

# ఆరు గ్యారంటీలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వం...

## రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ

**కబురు న్యూస్ బాన్సువాడ జనవరి 29**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వచ్చిన తర్వాత విస్మరించిందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం ఆయన కబురు ప్రతినిధితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్వేలు దరఖాస్తుల పేరుతో సంక్షేమ పథకాల అమలకు కాలయాపన చేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నాలుగు హామీలను ఆర్భాటంగా ప్రారంభించి కేవలం మండలానికి ఒకే గ్రామానికి మంజూరు పత్రాలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ 100% బాన్సువాడ నియోజకవర్గంలో



ఎక్కడ జరగలేదని, మహిళలకు 2500, స్కూటీలు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, పేదలకు ఇళ్లను ఎప్పుడు అందిస్తారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఆరోగ్యారెంటీ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు తప్ప రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరపడంలో విఫలమయ్యారన్నారు. నియోజకవర్గంలో బిజెపి బలంగా ఉంది...బాన్సువాడ నియోజకవర్గంలో బిజెపి పార్టీ క్షేత్రస్థాయిలో బలంగా ఉందని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామపంచాయతీ పై కాషాయపు జెండా ఎగరవేస్తామన్నారు. నాయకులు కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఇప్పటినుండే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని ఆయన బిజెపి శ్రేణులకు పిలుపునిచ్చారు.

# బేటి బచావో బేటి పడావోపై అవగాహన సదస్సు

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,జనవరి 29 :**
అర్బన్ మెప్మా మహిళా సంఘాల అధ్యక్షుల నెలవారి సమావేశాల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు జిల్లా ఆరోగ్య విద్యా బోధకులు ఘనపూర్ వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల పట్ల లింగ వివక్ష చూపరాదని,లింగ సమానత్వం కలిగి ఉండాలని లేనిచో స్త్రీ పురుషుల నిష్పత్తిలో అసమానతలు ఏర్పడి సాంఘికంగా,సామాజికంగా మహిళలపై దుశ్చర్యలు పెరుగుతాయన్నారు.ఈ సందర్భంగా మహిళలకు గర్భస్తపూర్వ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం(పిసిపిఎన్డిటి)పై అవగాహన కలిగించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా దీటుగా చదువుకొని పేరు ప్రఖ్యాతలు సంపాదిస్తున్నారన్నారు.అదేవిధంగా అమ్మాయిల్ని గౌరవించేలా అబ్బాయిలకు చెప్పాలని, ప్రతి తల్లిదండ్రులలో ఆత్మస్థైర్యం నింపుతూ మన జిల్లా నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన మలావత్ పూర్ణ,ఎండల సౌందర్య , నిఖ?త్ జరీనా, గుగులోతు సౌమ్య లాంటి అమ్మాయిలను స్ఫూర్తిగా తీసుకొవాలన్నారు.ఈ సమావేశంలో మెప్మా శోభారాణి,అశోక్, అధ్యక్షురాలు రంజిత,విజయ,సునంద, వివిధ ఏరియాలనుండి హాజరైన మెప్మా సంఘ అధ్యక్షురాలు పాల్గొన్నారు.



# ఎత్తొండ సహకార సంఘంలో భారీ అక్రమాలు...

## - సహకార సంఘాలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్న పాలకవర్గాలు

**కబురు న్యూస్ బాన్సువాడ, జనవరి 29**




సహకార సంఘాల ద్వారా రైతులను బలోపేతం చేయవలసిన పాలకవర్గాలు రాజకీయ నాయకులు తమకు అనుకూలంగా మార్చుకుంటూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ తమ జేబులు నింపుకుంటున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని ఎత్తొండ సహకార సంఘంలో 8 కోట్ల రూపాయలు అక్రమాలు జరిగాయని సంబంధిత అధికారుల విచారణలో వెల్లడైంది. అలాగే సొసైటీలో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు సమాచారం. 15 రోజుల్లో అధికారులు ఇచ్చిన నోటీసులను సరైన సమాధానం అధించకపోతే పాలకవర్గాన్ని రద్దు చేస్తామని సహకార జిల్లా అధికారి తెలిపారు. నియోజకవర్గంలోని కొన్ని సహకార సంఘలలో సొసైటీలో సుమారు 4 కోట్లకు పైగా అవినీతి జరిగాయని కొంతమంది సంబంధిత శాఖ ఉన్నత అధికారులకు పిర్యాదులు చేసిన పట్టించుకోవడంలేదని రైతులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సహకార సంఘాలలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన కార్పొరేషన్ చైర్మన్ కాసుల

**కబురు న్యూస్ బాన్సువాడ జనవరి 29**



హైదరాబాద్ లోని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను ఆయన నివాసంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ బుధవారం రోజున మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు..ఈ కార్యక్రమంలో నాయకులు ప్రదీప్ పటేల్ పాల్గొన్నారు.

# నేడు జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాలు

- 420 హామీలు అమలు చేయాలని డిమాండ్...
- మండల,నియోజక వర్గ,జిల్లా స్థాయిలో గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు...
- పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని జీవన్ రెడ్డి పిలుపు...

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,జనవరి 29 :**



ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమా లు చేపడుతామని నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈనెల 30వ తేదీ నాటికి 420 రోజులైన సందర్భంగా ప్రజలకిచ్చిన 420 ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమాలు చేపడు తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా మండల,నియోజక వర్గ,జిల్లా స్థాయిలో గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చి ఎన్నికల హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని ఆయన తెలిపారు.ఈ నిరసన కార్యక్రమాలలో అన్ని వర్గాల ప్రజలు,బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు,అన్ని స్థాయిల పార్టీ నాయకులు,ప్రస్తుత,మాజీ ప్రజాప్రతి నిధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# విశ్వకర్మ మనుమయ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి కి ఘన సన్మానం

**కబురు న్యూస్, గజ్వేల్ జనవరి 29,**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ ఎస్ సీ రాజమౌళి ని బుధవారం విశ్వకర్మ మనుమయ సంగం అధ్యక్షులు గడియారం వెంకటాచారి ఆధ్వర్యంలో విశ్వకర్మ మనుమయ సంఘం కమ్యూనిటీ హాల్లో ఘనంగా సన్మానించారు.విశ్వకర్మ మనుమయా సంఘం అధ్యక్షులు గడియారం వెంకట చారి మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుండి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు వారి సారథ్యంలోనే విశ్వకర్మమైన సంఘం కమిటీ హాలు నిర్మాణం జరిగిందని రాష్ట్రంలోనే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ అభివృద్ధికి విశేష కృషిచేసి ఆదర్శ మునిసిపాలిటీగా తీర్చిదిద్దిన ఘనత రాజమౌళి దే అని అన్నారు . వారి సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకుంటూ వారికి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని అన్నారు. వారితోపాటు స్థానిక మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి గడియారం విఠలాచారి, కోశాధికారి అరుణోజి లక్ష్మీనరసింహ చారి, గడియారం నాగరాజు చారి, పల్లెపాడు మాజీ సర్పంచ్ కొక్కొండ శ్రీనివాస్ చారి , టిఆర్ఎస్ పట్టణ యువజన అధ్యక్షులు గడియారం స్వామి చారి, అరుణోజి శ్రీనివాస్ చారి,బాల చారి ,పరిపూర్ణ చారి,వడ్ల నరసింహ చారి, మహేష్ చారి, నారాయణ చారి, తదితరులు పాల్గొన్నారు.

# యువతి మృతికి కారణమైన పీఎంపీ అరెస్టు



**కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,జనవరి 29 :**

యువతి మృతికి కారణమైన పీఎంపీని అరెస్టు చేసినట్లు నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి తెలిపారు.బుధవారం ఏసీపీ తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ,మాక్లూర్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన ఓ యువతి ఈ నెల 10న అనుమానాస్పద స్థితిలో చనిపోయిందని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.బాధితుల ఫిర్యాదు మేరకు మాక్లూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా కల్లెడి గ్రామానికి చెందిన 20 సంవత్సరాల యువతి మెండోరా మండలం సావెల్ గ్రామానికి చెందిన యువకుడు ప్రేమించుకున్నారని తెలిసింది.ఆ క్రమంలో వారు శారీరకంగా కలువడంతో యువతి గర్భందాల్చిందని,పెళ్లి కాకుండానే గర్భం ధరించడంతో దానిని తీసివేయించేందుకు సావెల్ గ్రామానికి చెందిన పీఎంపీ హరి కృష్ణ చారిని సంప్రదించారని తెలిపారు.అతని సూచనల మేరకు గర్భస్రావం మాత్రాలు సలహా ఇవ్వడంతో యువతికి మూడు రోజుల తర్వాత కడుపునొప్పి, బ్లీడింగ్ జరిగిందని ఏసీపీ తెలిపారు.యువతిని కుటుంబ సభ్యులు నిజామాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా కిడ్నీ,లివర్ కు ఇన్ ఫెక్షన్ సోకిందని,హైదరాబాద్ తరలించాలని సూచించగా 10న హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయిందని ఏసీపీ తెలిపారు.ఈ మేరకు పీఎంపీ హరి కృష్ణచారిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపుతున్నట్లు తెలిపారు.

# క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ను సందర్శించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,జనవరి 29 :**

నగరంలోని పాలిటెక్నిక్ మైదాంలో వెల్ నెస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ను నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు డాక్టర్.ఆర్. భూపతి రెడ్డి సందర్శించారు.అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని, బ్యాటింగ్ చేశారు.ఈ సందర్భంగా భూపతి రెడ్డి మాట్లాడుతూ క్రీడలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీఠ వేస్తుందని,నిజామాబాద్ జిల్లాలో అంతర్జాతీయ స్థాయిలో రానిస్తున్న నిఖత్ జరీనా,యెండల సౌందర్య,గుగులతో సౌమ్య,హుస్నామొద్దీన్ జిల్లాకు చెందిన వారిని స్పూర్తిగా తీసుకోని క్రీడాల్లో రానించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ,పిసిసి డెలిగేట్ శేకర్ గౌడ్,డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి,ఒమ్మజు నరేష్,నిజామాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్,నిజామాబాద్ రూరల్ యూత్ అధ్యక్షుడు మహేందర్,ఇతర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహా కుంభమేళాలో పుణ్య స్నానమాచరించిన ఎమ్మెల్యే ధన్పాల్ కుటుంబం

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,జనవరి 29 :**



ఉత్తర ప్రదేశ్ ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్నా మహాకుంభమేళకు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ కుటుంబ సమేతంగా వెళ్లారు.మౌని అమావాస్య రోజున ప్రయాగ్ రాజ్ లోని గంగ,యమున,సరస్వతి నదుల పవిత్ర కలయిక అయిన త్రివేణి సంగమంలో కుటుంబ సమేతంగా పవిత్ర స్నానాలు ఆచరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,144 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఈ మహాకుంభమేళా అన్నిటికంటే అతి పవిత్రమైనది అని అతి పెద్దదని సాధు,సన్యాసుల కలయిక ఈ మహా కుంభమేళా అన్నారు.ప్రయాగ్ రాజ్ త్రివేణి సంఘామంలో స్నానం ఆచరించడం వల్ల పాపాలు తొలగిపోయి పుణ్యం,మోక్షం లభిస్తుందని భక్తులందరి నమ్మకం అన్నారు. ఈ కుంభమేళాకు దేశ నలుమూలల నుండే కాకుండా విదేశాల నుండి కూడా భక్తులు కోట్ల సంఖ్యలో రావడం ప్రపంచ వ్యాప్తంగా మన సనాతన హిందూ ధర్మాన్ని ప్రతిబింభించేల ఉందన్నారు. సామాన్య భక్తులకు సైతం ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తున్నందుకు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి తెలంగాణ భక్తులందరి తరపున ధన్యవాదములు తెలిపారు.

# మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి జైలు శిక్ష...

**కబురు న్యూస్,బోధన్ జనవరి 29..**

మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష ఖరారైనట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. బోధన్ పట్టణంలో మద్యం తాగి వాహనం నడిపిస్తున్న జింక గంగాధర్ పై కేసు నమోదు చేసి బుధవారం పట్టణంలోని న్యాయస్థానంలో గల సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేష తల్ప సాయి ఎదుట హాజరుపరచడం జరిగిందని సీఐ పేర్కొన్నారు. పరిశీలించిన న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఆయన తెలిపారు.

# బాధిత కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ...



**కబురు న్యూస్,బోధన్ జనవరి 29..**

బోధన్ మండలంలోని ఎరాజ్ పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భాధిత కుటుంబ సభ్యులకు చెక్కులు పంపిణీ చేశారు. బుధవారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామానికి చెందిన భాధితుడు పర్శి బాబు కుటుంబ సభ్యులకు 60,000 రూపాయల, అఖిలేష్ కుటుంబ సభ్యులకు 8,000రూపాయల విలువ గల సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవ్ రెడ్డి, గంగారెడ్డి, వసంత్ తదితరులు ఉన్నారు.

# వాకర్స్ తో కలిసి ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య..



**కబురు న్యూస్ కామారెడ్డి జనవరి 29**



ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనకు అవకాశం కల్పించి ఎమ్మెల్సీగా గెలిపించినట్లయితే ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం కోసం పనిచేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య అన్నారు. బుధవారం టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య వాకింగ్ చేస్తున్న టీచర్ల తో కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య వాకింగ్ చేశారు. తనను ఎమ్మెల్సీ గా గెలిపిస్తే టీచర్ల సమస్యలను పరిష్కారం చేయిస్తానని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షులు పుల్గం రాఘవరెడ్డి, రామచందర్ ,లక్ష్మీపతి, నర్సింలు, పవన్, తదితరులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# విద్యార్థులకు నిరంతర సాధనే విజయానికి కారణం... నక్క నవీన్



**కబురు న్యూస్ సదాశివ నగర్ జనవరి 29**

ప్రతి విద్యార్థి నిరంతర సాధన దిశగా కృషి చేసినట్లయితే విజయాలు తమ దరికి చేరుతాయని వ్యక్తిత్వ వికాస నిపుణులు నక్క నవీన్ అన్నారు. బుధవారం సదాశివ నగర్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరీక్షల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు తమ చిన్ననాటి నుండి లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని దానికి అనుగుణంగా అడుగులు వేసినప్పుడే తమ లక్ష్యాల్ని నెరవేర్చుకోగలుగుతారన్నారు. విద్యార్థులు పరీక్ష అనే భయాన్ని విడనాడి పోటీ పరీక్షల్లో తమ సత్తా తెలియజేసేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రాజిరెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శనీయుడు జర్నలిస్టు మల్లెపూల నరేందర్

**– నుడా చైర్మన్ కేశ వేణు...**

**– క్రీడాకారులకు బహుమతులు ప్రదానం**

**కబురు న్యూస్,నిజామాబాద్ ప్రెస్ క్లబ్,జనవరి 29 :**

జర్నలిస్టు స్వర్గీయ మల్లెపూల నరేంద్ర కుమార్ నేటితరం జర్నలిస్టులకు ఆదర్శమని నుడా చైర్మన్ కేశ వేణు అన్నారు.బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టు మల్లెపూలు నరేంద్ర కుమార్ 34 వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేశ వేణు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మంచి స్నేహశీలి 1991 జనవరి 29న ముదక్ పల్లి వద్ద పోలీస్,నక్సలైట్ల ఎదురుకాల్పులలో మృతి చెందడం ఎంతో బాధాకరమన్నారు.చిన్న వయసులోనే వృత్తి పట్ల ఎంతో నిబద్ధత కలిగి ఉండి వార్తలను రాసేవారని అన్నారు.ఆయన గ్రామీణ ప్రాంత విలేఖరిగా పని చేస్తూ ఆ ప్రాంతాలలో ప్రభుత్వం స్పందించే రీతిలో ప్రజల సమస్యలను కండ్లకు కట్టినట్లు కథనాలు రాసేవారని అన్నారు.నాడు రవాణా సదుపాయం లేకపోయినప్పటికీ తనకు ఏదైనా సమాచారం తెలిస్తే అక్కడికి తప్పకుండా వెళ్లేవారన్నారు.అందులో భాగంగానే జనవరి 29న న్యూస్ కవరేజ్ కోసం వెళ్లి పోలీస్,నక్సలైట్ల మధ్య జరిగిన ఎదురు కాల్పులలో మృతి చెందడం బాధాకరమన్నారు.ఈ సంఘటన జరిగి 34 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికి ఆయనను గుర్తుంచుకొని ఆయన పేరిట కార్యక్రమాలు నిర్వహించడం



నిర్వాహకులను,సహకారాలు అందిస్తున్న వారిని అభినందించారు.ఒక వ్యక్తి మృతి చెందితే ఆయన పేరిట ఐదు సంవత్సరాలు వరకు మాత్రమే కార్యక్రమాలు నిర్వహించి మర్చిపోతారని,కానీ జర్నలిస్టు నరేంద్రను 34 సంవత్సరాలుగా స్మరించుకుంటూ ఆయన పేరిట స్మారక క్రీడా పోటీలు నిర్వహించడం బహుశా ఎక్కడ లేదని అన్నారు. దీనిని ఇలాగే కొనసాగించాలని నిర్వాహకులకు సూచించారు.ప్రస్తుతం జర్నలిజం దయనీయ పరిస్థితుల్లో ఉందన్నారు.జర్నలిస్టులను కష్ట కాలంలో ఆదుకోవడానికి ఏర్పాటుచేసిన వెల్ఫేర్ కమిటీకి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.జర్నలిస్టులు పూర్తి అంకితభావంతో పనిచేస్తున్న వారి కుటుంబ పోషణ కు సరిపడే ఆదాయం రాకపోవడం శోచనీయమన్నారు.బాపూజీ వచనాలయం కమిటీ చైర్మన్ భక్తవత్సలం మాట్లాడుతూ, జర్నలిజంలో మంచి గుర్తింపు



పొందిన జర్నలిస్టుగా నరేందర్ గుర్తింపు పొంది అనాతి కాలంలోనే మృతి చెందడం వారి కుటుంబానికి తీరని లోటు అన్నారు. అందరితో మంచి స్నేహం కలిగి ఉన్న నరేందర్ కవిగా రచనలు కూడా చేశారని గుర్తు చేశారు. ఒకప్పుడు జర్నలిజం వృత్తిలో తక్కువ మంది కొనసాగేవారు.ఇప్పుడు అనేక వృత్తిలో కొనసాగుతుండడం సంతోషకరం అని అన్నారు. కానీ జర్నలిస్టులకు సరైన జీతభత్యాలు లేకపోవడం దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిస్టులు ఇలా కొనసాగిస్తూనే మరింత సంపాదన కోసం మరో మార్గాలను అన్వేషించుకోవాలని సూచించారు. బాపూజీ వచనాలయంలో కమిటీలో ఐదుగురికి చోటు కల్పిస్తామని,ప్రెస్ క్లబ్ నుంచి పేర్లు అందజేయాలని కోరారు.ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతడుపుల రామకృష్ణ మాట్లాడుతూ,జర్నలిస్టు నరేంద్రను గుర్తుంచుకొని 34 సంవత్సరాలుగా పోటీలు నిర్వహించడం గొప్ప విషయం అన్నారు.ప్రతి సంవత్సరం జర్నలిస్టులకు క్రీడా పోటీలు నిర్వహిస్తూ తమలో ఐక్యత భావాన్ని కొనసాగుతుందన్నారు.ఈ సందర్భంగా నరేంద్ర సోదరులను అభినందించారు.ప్రజాగళం పత్రిక సీఈవో కొక్కు రవికుమార్ ప్రతి సంవత్సరం ఈ క్రీడా పోటీలకు సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు వచ్చారు.అనంతరం జర్నలిస్ట్ మల్లెపూల నరేంద్ర 34 వర్ధంతి పురస్కరించుకొని జర్నలిస్టులకు ఏర్పాటుచేసిన షటిల్, బ్యాట్మెంటన్,క్యారం పోటీలలో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. క్యారం పోటీలలో గెలుపొందిన సంజీవరెడ్డి,సదానంద్ లకు ప్రథమ బహుమతి, డాన్స్ రాజు, శ్రీకాంత్ లకు ద్వితీయ బహుమతులను అందజేశారు. అలాగే షటిల్, బ్యాడ్మింటన్ పోటీలలో శ్రీకాంత్,భాను తేజ లకు ప్రథమ బహుమతి,గంగా దాస్,దశరథులకు ద్వితీయ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బైరా శేఖర్, జిల్లా ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ బొబ్బిలి నర్సయ్య, స్పోర్ట్స్ కమిటీ వ్యవస్థాపక సభ్యుడు సాంబయ్య,కన్వీనర్ మల్లెపూల నరసయ్య,టీయు డబ్ల్యూజే 143 యూనియన్ అధ్యక్షుడు రజినికాంత్,ఉపాధ్యక్షుడు బాలు కుమార్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు చింతల గంగాదాస్,తెలంగాణ జర్నలిస్టు యూనియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరసింహ చారి,ప్రధాన కార్యదర్శి సుభాష్ వాగ్మారే,సీనియర్ పాత్రికేయులు పాకాల నరసింహులు,సాయి ప్రసాద్,మల్లెపూల నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే యూనియన్ లక్ష్యం

**– రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ...**

**– ఘనంగా టియుడబ్ల్యూజే ఐజేయు సభ్యత్వ నమోదు కార్యక్రమం...**

**– ప్రారంభించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ...**

**కబురు న్యూస్,భద్రాద్రి కొత్తగూడెం,జనవరి 29 :**

జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక యూనియన్ టియుడబ్ల్యూజే ఐజేయు అని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ అన్నారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం క్లబ్లో టీయూడబ్ల్యూజేఐజేయు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కట్టెకోల రామనారాయణ హాజరై మాట్లాడారు. రామ్ నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు, నివాస స్థలాల సాధన విషయంలో













నిరంతరం రాజీ లేని పోరాటం టియుడబ్ల్యూజే ఐజేయు చేస్తుందని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మూడవ మహాసభ జరగనుందని సభ్యత్వం నమోదు కార్యక్రమానికి ఇంత పెద్ద ఎత్తున ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులు తరలిరావడం చాలా సంతోషంగా ఉందని రామనారాయణ అన్నారు. ఈ సందర్భంగా యూనియన్ మీద అన్న నమ్మకంతో ఇతర యూనియన్ల నుండి భారీ ఎత్తున ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియా జర్నలిస్టులు ఐజేయూ యూనియన్లో సభ్యత్వ నమోదు చేయించుకున్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో జర్నలిస్టుల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేసి లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో యూనియన్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు దుద్దుకూరి రామారావు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకటరావు, జిల్లా కార్యదర్శి మబకాపు ఆనంద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జనుమాల రమేష్, ఖమ్మం యూనియన్ నగర అధ్యక్షుడు శ్రీనివాస్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏర్పుల సుధాకర్ రావు, ఉపాధ్యక్షులు కనుకు వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ ఎర్ర ఈశ్వర్, పెండ్యాల భాస్కరరావు,వీర మోహన్,జి శ్రీనివాస్,చంద్రశేఖర్, వీరభద్రం, నరసింహారావు, జైనుల్లాబుద్దిన్, బి శంకర్, దశరథ్ రజువ, భాస్కర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీకి పని చేస్తేనే అవార్డులు ఇస్తారాబండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలితెలంగాణ నుంచి తరిమికొట్టాలిజిల్లా కాంగ్రెస్ నేత కోనాపూర్ బక్కప్ప

**కబురు న్యూస్, సంగారెడ్డి జనవరి 29**



తెలంగాణ ప్రజా యుద్ధ నౌక గద్దర్ పట్ల అవమానకరంగా మాట్లాడిన కేంద్రమంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోనాపూర్ బక్కప్ప బుధవారం రోజు ఆయన మీడియాతో మాట్లాడారు,బండి సంజయ్ మాటలు గల్లీ లిడార్ కంటే హీనంగా ఉన్నాయని అన్నారు,తన పాటలతో ఉద్యమన్నీ అగ్రుతలుగించారని అన్నారు,ఆయన జీవితం మొత్తం పేద,బడుగు,బలహీన వర్గాల అభివృద్ధి కోసం,తెలంగాణ కోసం త్యాగం చేశారన్నారు,ఒక గొప్ప తెలంగాణ అమరుడిని పట్టుకొని కించపరిచేలా మాట్లాడడం బండి సంజయ్ కుసంస్కారనికి నిదర్శనం అన్నారు,తెలంగాణ ఉద్యమంలో గద్దర్ గారి పాత్ర మారువలేనిదని తెలంగాణ సంస్కృతి,కళలు గద్దర్ పాటలు,కవితల్లో ప్రతిబింబిస్తాయని దగ్గర గారు మరణించినప్పుడు ప్రధాని మోదీ గారు పంపిన సంతాప లేఖలో పేర్కొన్నారని గుర్తు చేశారు,అలాగే బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్నా సమస్యలు,బాధలు గద్దర్ తల కవితలతో,పాటలతో ప్రజలను చైతన్య పరుస్తూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు,కళలు కవితలను పునర్జిపచేయడంలో గద్దర్ పాత్ర కీలకం,ఆయన కృషి ఎప్పటికి నిలిచిపోతుందని కొనియాడారు, దేశ ప్రదానే గద్దర్ సేవలను గుర్తు చేస్తే,తెలంగాణలో పుట్టి,తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన బండి సంజయ్ గద్దర్ గురించి దురుసుగా అవమానించి దుర్మాగంగా మాట్లాడటం సరికాదన్నారు, తెలంగాణను అవనించిన బండి సంజయ్ తెలంగాణ రాష్ట్రంలో ఉండే అర్హత లేదన్నారు,తెలంగాణలో ఉండాలంటే గద్దర్ గారికి అలాగే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు....

# వర్నిలో సీ.హెచ్.సీ,పాఠశాలలను తనిఖీ చేసిన కలెక్టర్

**కబురు న్యూస్,నిజామాబాద్, జనవరి 29 :**

విద్య,వైద్య రంగాల పనితీరులో గణనీయమైన మార్పు కనిపించేలా అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. బుధవారం ఆయన వర్ని మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను, పాత వర్ని లో ఒకే ప్రాంగణంలో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు, మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీ.హెచ్.సీ లోని లేబొరేటరీ రూమ్, ఇన్ పేషంట్ వార్డ్, హెల్ప్ డెస్క్, వ్యాక్సినేషన్ రూమ్ తదితర వాటిని పరిశీలించారు. డ్రగ్ స్టోర్ రూమ్ లోని మందుల నాణ్యత,వాటి కాలపరిమితిని చెక్ చేశారు.ప్రతిరోజూ ఎంతమంది రోగులు సందర్శిస్తారు,ఎంతమంది ఇన్ పేషంట్లుగా చేరుతున్నారు, సరిపడా వైద్యులు,సిబ్బంది అందుబాటులో ఉన్నారా? అన్ని రకాల మందులు ఆసుపత్రిలోనే ఉచితంగా అందిస్తున్నారా తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జ్వరం వంటి వ్యాధులతో చికిత్స కోసం వచ్చే వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని,మలేరియా వంటి వ్యాధులు సోకకుండా ముందస్తుగానే నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ హితవు పలికారు.ప్రతి ఒక్కరు సమయ పాలన పాటిస్తూ,మెరుగైన సేవలు అందించాలన్నారు.అనంతరం కలెక్టర్ పాత వర్ని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు, జ్యోతిబాపూలే











గురుకులాన్ని సందర్శించి అందుబాటులో ఉన్న వసతి సదుపాయాలు పరిశీలించారు. స్టోర్ రూమ్,కిచెన్ లను తనిఖీ చేసి బియ్యం,కూరగాయలు,ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. నిత్యావసర సరుకులు,బియ్యం,కూరగాయల సరఫరా విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని నిర్వాహకులను ఆరా తీశారు.తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న బోధన తీరును కలెక్టర్ పరిశీలించారు.ఐదవ తరగతి విద్యార్థినులతో ఆంగ్లం సబ్జెక్టులోని పాఠాలు చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఏకాగ్రతతో చదువుకుని ఉన్నత స్థానాలలో రాణించాలని,ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు.కాగా,ఉన్నత పాఠశాలలో తరగతి గదుల కొరత ఉందని ప్రధానోపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తేగా,అదనపు తరగతి గదులను మంజూరు చేస్తామని అన్నారు.కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

## గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్ బాయ్స్ హాస్టల్స్ సందర్శన, నూతన మెను అమలు చేయాలి

**–యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రవి, తిరుపతి డిమాండ్–**





**కబురు న్యూస్, గజ్వేల్ జనవరి 29,**

గజ్వేల్ పట్టణంలో ఉన్న బాయ్స్ ఎడ్యుకేషన్ హబ్ హాస్టల్స్ సందర్శించిన యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తాటికొండ రవి,మాదం తిరుపతి అనంతరం వారు మాట్లాడుతూ నూతన మెనూ మొదలైన కూడా అమలుకు నోచుకోలేని పరిస్థితి గజ్వేల్ హబ్ హాస్టల్లో ఉందన్నారు,స్కూల్ హాస్టల్స్ వార్డెన్ లు సమయానికి రావట్లేదని అన్నారు,విద్యార్థులకు నాసిరకం భోజనం పెడుతున్నారు, బియ్యంలో పురుగులు ఉండడంతో విద్యార్థులు ఉదయం సమయంలో బయట టిఫిన్ చేసి వస్తున్నారన్నారు, నాసి రాకపు భోజనం పెడుతూ నీళ్ల చారు పోస్తున్నారు రాత్రి మిగిలిన చారు ఉదయం టిఫిన్ లోకి వాడుతున్నారు, నూతన మెను అమలు చేయమంటే డబ్బులు ఎక్కువగా అవుతున్నాయని పాత మెను పెడుతున్నారు, మరియు ఈ హాస్టల్స్ ని పై అధికారుల తనిఖీలు లేవన్నారు వందల మంది ఉన్న విద్యార్థులకు న్యాయం చేయలేని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని అన్నారు. లేనియెడల విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు నాచారం శేఖర్, డివిజన్ నాయకులు తిమ్మాపురం యాదగిరి, సందీప్, నిఖిల్ , దినేష్ తదితరులు ఉన్నారు.

# చెరువులు, కుంటలకు హద్దులు నిర్ణయించాలని తహశీల్దార్ కు వినతి



## – కోరుట్ల డెవలప్మెంట్ ఫోరమ్

**కబురు న్యూస్,కోరుట్ల:**
కోరుట్ల పట్టణంలోని చెరువులు, కుంటలపై జగిత్యాల జిల్లా కలెక్టర్ అదేశాలు మేరకు హద్దులు నిర్ణయించి కబ్జాలు కాకుండా కట్టడి చేయాలని కోరుతూ కోరుట్ల తహశీల్దార్ ఇట్యాల వెంకట కిషన్ ను కోరినట్లు కోరుట్ల డెవలప్మెంట్ ఫోరమ్ అధ్యక్ష కార్యదర్శులు చెన్న విశ్వనాథం, డాక్టర్ పేట భాస్కర్ లు తెలిపారు.
బుధవారం కోరుట్ల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ను కలిసిన ఫోరమ్ నాయకులు మాట్లాడుతూ చెరువులు కుంటలు కబ్జా దారుల కబంధ హస్తాల్లో బంది అయిన వాటిని కాపాడి వాటికి హద్దులు నిర్ణయించి పట్టణ ప్రజలకు, గంగపుత్రులకు న్యాయం చేయాలని కోరుతూ గతంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ కు చేసిన పిర్యాదు మేరకు రెవెన్యూశాఖ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖలకు వెంటనే హద్దులు నిర్ణయించాలని జిల్లా కలెక్టర్ అదేశాలు జారీ చేసిన లేటర్ ను తహశీల్దార్ కు అందించినట్లు ఫోరమ్ నాయకులు చెన్న విశ్వనాథం, పేట భాస్కర్ లు పేర్కొన్నారు. వారి వెంట నాయకులు ఎలిశెట్టి గంగారెడ్డి, ఎస్ రాజయ్యలు వున్నారు.

# విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి పై కేసు నమోదు

**కబురు న్యూస్, జగిత్యాల: జనవరి 29**
విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బుగ్గారం ఎస్ఐ మాడ శ్రీధర్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి బుగ్గారం మండల కేంద్రంలోని చుక్క జలపతి కిరణం షాప్ వద్ద బుగ్గారంకు చెందిన ఏలేశ్వరం సాయికుమార్ అనే యువకుడు మద్యం మత్తులో న్యూసెన్స్ చేస్తున్నాడని డయల్ 100 కాల్ రాగా ప్రదేశానికి చేరుకున్న కానిస్టేబుల్ ప్రవీణ్, హొంగార్డు సాజిద్ లను దుర్భాషలాడుతూ,వారి విధులకు ఆటంకం కలిగించినందుకు ఏలేశ్వరం సాయికుమార్ పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పోలీసుల పట్ల అమర్యాదగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించే విధంగా ఎవరు ప్రవర్తించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# గురుకుల ప్రవేశ పరీక్షకు ఆన్లైన్ ఆటంకాలు

**కబురు న్యూస్, నిజాంపేట్**
నిజాంపేట మండల పరిదిలోని పలు గ్రామాల్లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతికి గురుకుల ప్రవేశ పరీక్షకు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. ఈ మేరకు బుధవారం నాడు ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలో చదువుతున్న 5వ తరగతి నుంచి 9వ తరగతి ప్రవేశ పరీక్షకు ధరాఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. కాని విద్యార్థులకు పరీక్ష కేంద్రాలు ఎన్నుకోవడంలో పాఠశాలలు చూపకపోవడంతో ధరాఖాస్తు పూర్తి చేయడంలో తీవ్ర ఇబ్బందులుగురౌవుతున్నారు. ఈ ప్రవేశ పరీక్షకు పిబ్రవరి 1న చివరి తేది కావడంతో విద్యార్థులు అయోమయ్యం అవుతున్నారు. అదికారులు వెంటనే స్పందించి ప్రవేశ పరీక్షకు కేంద్రాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# డ్రైవర్లు అనునిత్యం అప్రమత్తంగా ఉండాలి.

..మద్యం సేవించి వాహనాలు నడపరాదు .
... జగిత్యాల డి టి ఓ ఎం శ్రీనివాస్.

**కబురు న్యూస్, మెట్ పల్లి, జనవరి 29.**



జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్ లో జాతీయ రోడ్డు భద్రత వాత్సవంలో భాగంగా బుధవారం ఘనంగా సడక్ సురక్ష అభియాన్ కార్యక్రమం ఆర్డిఓ అధికారుల ఆధ్వర్యంలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగిత్యాల డి టి వో ఎం శ్రీనివాస్, మెట్పల్లి డి.ఎస్.పి రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల డి టి ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని డ్రైవర్లు అనునిత్యం అప్రమత్తంగా వాహనాలను నడపాలని ,ప్రమాదాలకు గురి కాకుండా చూడాలని అన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలను నడపరాదని సూచించారు . మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వ వద్దని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రమాదాలకు గురైన కుటుంబాలు రోడ్డున పరే పరిస్థితికి వస్తుందని తెలియజేశారు. ప్రమాదాలు నివారించడానికి సెల్ ఫోన్లు మాట్లాడుతూ, నిద్రలేమితో వాహనాలు నడపరాదని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని అన్నారు. హెల్మెట్ లేకపోవడం వల్ల ఎంతోమంది ప్రమాదాల గురై చనిపోవడం ప్రతినిత్యం మనం చూస్తూనే ఉన్నామని తప్పనిసరిగా హెల్మెట్ ను వాడాలని ఈ సందర్భంగా డిటిఓ శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డి టి వో యం శ్రీనివాస్, మెట్పల్లి డి.ఎస్.పి రాములు,మెట్పల్లి ఎస్సై కిరణ్ కుమార్, ఎం వి హై లు రామారావు, అభిలాష్, షేక్ రియాజ్, కానిస్టేబుల్లు రవి, గిరీష్ కుమార్, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, డ్రైవర్లు, పాల్గొన్నారు.

# గద్దర్ విప్లవగాయకుడు కాదా... పద్మశ్రీ అవార్డు ఎందుకు ఇవ్వాలి..?

– పెండెం గణేష్ ...
(మాజీ మున్సిపల్ కౌన్సిలర్)

**కబురు న్యూస్, కోరుట్ల: జనవరి29**
అభం శుభం ఎరుగని ఎందరో బడుగు బలహీన వర్గాల పిల్లలని నక్షలిజం వైపు మళ్లించి ఎందరో తల్లులకు కడుపు కోత మిగిల్చిన ఘనత గద్దర్ దే అని,కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడిన దాంట్లో తప్పేమీ ఉందని, బిజెపి మాజీ కౌన్సిలర్ పెండెం గణేష్ ధ్వజమెత్తారు.తన పిల్లలను మాత్రం ఉన్నత చదువులు చదివించుకున్నందుకు అవార్డు ఇవ్వాలా? అని స్వామియే శరణం అయ్యప్ప మా కొంప ముంచావురా అయ్యప్ప అన్నందుకు అవార్డు ఇవ్వాలా?అని పార్లమెంటుని పందుల దొడ్డి అని, అసెంబ్లీని బాతకాల క్లబ్ అని అవహేళన చేసినందుకు అవార్డు ఇవ్వాలా? అని ప్రజల ప్రాణమానాలను రక్షించే వందల మంది పోలీసులను చంపించినందుకు అవార్డు ఇవ్వాలా? అని దేశం కోసం, ధర్మం కోసం పోరాడే దేశభక్తులను



చంపించినందుకు అవార్డు ఇవ్వాలా? అని చివరకు గత కాంగ్రెస్ ప్రభుత్వంలోని మాజీ స్పీకర్ ని, కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను చంపించినందుకు ఇవ్వమంటున్నారా.. అని ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని సూటిగా ప్రశ్నిస్తున్నామని పెండెం గణేష్ విమర్శించారు. పద్మశ్రీ అవార్డు గురించి విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆత్మ విమర్శ చేసుకోవాలని,వారి వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నామని ప్రజాస్వామ్యం నమ్మని వాడు,ఓటు వేయని వాడు, ప్రజా హక్కులను విస్మరించినవాడు పాటలతో రెచ్చగొట్టి ప్రజల జీవితాలను నాశనం చేసినందుకు అవార్డు ఇవ్వాలా? అని ప్రజలు ఎన్నుకున్న ప్రజాస్వామ్య గణతంత్ర భారతం అలాంటి వ్యక్తికి మన దేశపు అత్యున్నత పురస్కారాలు ఎలా ఇస్తుందని, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్నీ సత్కరించి, సన్మానించి పద్మశ్రీ అవార్డు కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారా తెలియజేయాలని అన్నారు.అసలు అవార్డ్ ఎందుకు ఇవ్వాలి అని ఎలా ఇవ్వాలి అనిమీకు మీరే ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ పట్టణ ప్రధానకార్యదర్శి చెట్లపెల్లి సాగర్,జక్కుల ప్రవీణ్,గందె నవీన్,గుండేటి సంజీవ్,దమ్మ సంతోష్,రుద్ర ప్రశాంత్,కంఠం ఉదయ్,మామిడిపెల్లి విజయ్,వాసం సతీష్,గుండేటి సాయికుమార్,వాసాల నవీన్,రుద్ర విగ్నేష్,వెగ్యరపు అభిషేక్,జిల్ల ఉదయ్,మిట్టపెల్లి రవి,నల్ల ప్రణయ్ ,తదితరులు పాల్గోన్నారు

# ఎన్టీపీసీ స్టేజ్ -2 ప్లాంట్ విస్తరణలో ప్రభావిత ప్రాంతాల ప్రజల సమస్యలు పరిష్కరించాలి..

**– స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.**
**– మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్**

**కబురు న్యూస్, రామగుండం జనవరి, 29:**
ఎన్టీపీసీ స్టేజ్ -2 ప్లాంట్ విస్తరణలో ప్రభావిత ప్రాంతాల ప్రజల సమస్యలు పరిష్కరించాలని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ కోరారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వినతి పత్రం అందించారు.అనంతరం కోరుకంటి చందర్ మీడియాతో మాట్లాడారు. ఎన్టీపీసీ



ప్రాజెక్టు ఎర్పాటు కోసం గతంలో 10 వేల ఎకరాలు సేకరించిందని... మళ్ళీ 600 ఎకరాలు భూసేకరణ చేస్తున్నదన్నారు. గత పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు ఇప్పుడు తేడా ఉందని చెప్పారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పోలీస్ పహారా నడుమ ప్రజ అభిప్రాయ సేకరణ నడుస్తుందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ అంటే ప్రజల నుండి అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. ప్రభావిత ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించాలి అని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుందన్నారు. బద్రిపల్లి, మల్యాలపల్లి, యాష్ ప్లాంట్తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పోలీస్ కమిషనరేట్ పక్కన ఖాళీ స్థలం లో ప్రభావిత గ్రామాల ప్రజలను తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుమ్మరి శ్రీనివాస్ నారాయణదాసు మారుతి, నూతి తిరుపతి, ఇరుగురాళ్ల శ్రావణ్, వడ్లకొండ మహేందర్ పాల్గొన్నారు.

# తాజా మాజీ కార్పొరేటర్లకు అభినందన సత్కారం చేసిన కోరుకంటి చందర్....

**– తొలి సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందెలా కార్పోరేటర్ల కృషి**
**– రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్.**

**కబురు న్యూస్, రామగుండం జనవరి, 29:**
తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందెలా కార్పోరేటర్ల కృషి చేశారని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే చందర్ నివాసంలో బి.ఆర్.ఎస్ తాజా మాజీ కార్పోరేటర్లకు అభినందన సత్కారాన్ని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేపట్టారు. శాలువాలు మెమేంటోలతో



సత్కారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం కార్పోరేషన్ లో 5 సంవత్సరాల పాటు డివిజన్లో ప్రజలకు మౌళిక సదుపాయాలు అందించడంలో ప్రజాప్రతినిధులు ఎంతగానో పనిచేశారన్నారు. తోలి సిఎం కేసీఆర్ బంగారు తెలంగాణ భాగస్వామ్యం కావడం, మాజీ మంత్రి వర్యులు కేటీఆర్ పట్టణ ప్రగతిలో డివిజన్ అభివృద్ధి చేపట్టడం జరిగుందన్నారు. ప్రతి ఇంటికి నల్ల కనెక్షన్ రోడ్ల నిర్మాణం అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టి ప్రజల మన్ననలు పోందరన్నారు. రాబోవు కాలంలో మరింత ఉజ్వలమైన భవిష్యత్తు ఎన్నికల్లో ప్రజలు తిరిగి అవకాశం కల్పించాలన్నారు. పెంట రాజేష్ పాముకుంట్ల భాస్కర్ కుమ్మరి శ్రీనివాస్ బోడ్డు రజిత రవీందర్ జంజర్ల మౌనిక జె.వి.రాజు రాకం లత దామ్మెదర్ రమణ రెడ్డి కల్వచర్ల కృష్ణ వేణి భూమయ్య కన్నూరి సతీశ్ కుమార్ ముదాం శ్రీనివాస్ బాదె అంజలి గాదం విజయ నందు కో ఆప్షన్ సభ్యులు రఫీక్ వంగ శ్రీనివాస్ గౌడ్ తస్లీమభాను జహిద్ పాషా మాజీ ఎంపిటి లు కొలిపాక శరణ్య మధుకర్ రెడ్డి శ్రీవాణీ కిరణ్ హతీక్ నాయకులు నారాయణదాసు మారుతి చల్లా రవీందర్ రెడ్డి అచ్చే వేణు సట్టు శ్రీనివాస్ ఇరుగురాళ్ల శ్రావన్ తదితరులు పాల్గొన్నారు

# మంజీరా నదిలో పుణ్య స్థానాలు ఆచరించిన భక్తులు

## –భక్తులతో కిటకిటలాడిన చాముండేశ్వరి ఆలయం

**కబురు న్యూస్, సంగారెడ్డి ప్రతినిధి:**
మూగ అమావాస్యను పురస్కరించుకొని జోగిపేట పట్టణానికి సమీపంలోని మంజీరా నదిలో భక్తులు అధిక సంఖ్యలో స్నానాలు ఆచరించి నది ఒడ్డున వెలసిన శ్రీ చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ క్షేత్రంలో వెలిసిన అమ్మవారు కోరిన కోరికలు తీరుస్తూ భక్తుల పాలిట కొంగు బంగారంగా నిలుస్తుందన్న భక్తుల అపార నమ్మకం. జిల్లా నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, జంట నగరాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలి వచ్చారు. ఎవరికి ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా శ్రీ చాముండేశ్వరి శక్తమండలి వారు, పోలీసులను కూడా ఏర్పాటు చేశామని ఎస్సై నర్సింలు తెలిపారు. మంజీరా నది వద్ద భక్తులకు ఎలాంటి



ప్రమాదం చోటు చేసుకోకుండా మత్స్యకార కార్మికులు కూడా శ్రమించారు. కానీ మంజీరా నదిలో గుర్రపు డెక్క అనే తీగ నది మొత్తం పాడుకపోవడంతో భారీ ఎత్తున ఉన్న నీళ్లు కనిపించకుండా పోయాయి. ఇది గమనించని భక్తులు అందులో స్నానాలు చేయడానికి వెళితే ప్రమాదకరంగా కనిపిస్తున్న అది ఎలాంటి అధికారులు పట్టించుకోలేకపోయారు. ఏది ఏమైనాప్పటికీ అమ్మవారి కృపతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా భక్తుల పుణ్య సామాలు విజయవంతంగా ముగిసాయి.

# టీనేజ్ అమ్మాయిలు వీటిని కచ్చితంగా తినాలి.. లేకపోతే హార్మోన్లలో మార్పులు వస్తాయి..!



కబురు న్యూస్, డెస్క్ జనవరి 29..

టీనేజ్ అమ్మాయిల శరీరాల్లో శారీరకంగా, మానసికంగా మార్పులు మొదలవుతాయి. అందువల్ల ఈ వయసులో శరీరానికి తగిన పోషకాలు అందించాలి. టీనేజ్ అమ్మాయిల్లో 30% ఐరన్ లోపం, 20% విటమిన్ -ఏ తక్కువగా ఉంటున్నాయని సర్వేలు చెప్తున్నాయి. టీనేజ్లో ఈ పోషకాల లోపం వల్ల శరీరంలోని హార్మోన్లలో హెచ్చుతగ్గులు కూడా చోటుచేసుకుంటున్నాయి. అందువల్ల ఈ వయసు అమ్మాయిలు కాల్షియం, ఐరన్, అయోడిన్ ఎక్కువగా లభించే ఆహారాన్ని తీసుకోవాలి అంటున్నారు నిపుణులు.

అలాగే ఆడపిల్లలు ఎదిగి గర్భం దాల్చినప్పుడు, పిల్లలకు పాలిచ్చే సమయానికి ఎలాంటి బలహీనతలూ, ఆరోగ్య సమస్యలూ రాకుండా ఉండాలంటే పదేళ్లవయసు నుంచే



మాంసకృత్తులు ఉన్న ఆహారం ఇవ్వాలి. ఈ దశలో పిల్లలకు పోషకాలున్న ఆహారం ఇస్తే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు అంటున్నారు. డాక్టర్లు. అంతేకాదు ఏం ఏం తినాలో కూడా చెప్తున్నారు.ఇవి తినాలిచేపలు, గుడ్లు, పాలు, చీజ్, కోడి మాంసం, మటన్లో ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కండరాలను బలంగా చేయడంతో పాటు కణాల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.అందువల్ల వీటిని తరచూ తీసు కుంటూ ఉండాలి.అలాగే కాల్షియం అధికంగా ఉండే క్యాబేజీ, బ్రొకోలి, ఓక్రాలను కూడా డైట్ లో చేర్చాలి. వీటితో పాటు ఐరెన్ కోసం మాంసం, పాలకూర తీసుకోవాలి.

# ఆవనూనెతో నొప్పులు మాయం!


కబురు న్యూస్, డెస్క్ జనవరి 29..



వంటలకు ప్రత్యేక రుచి రావాలన్నా... బియ్యం పప్పులు నిల్వ ఉంచేటప్పుడు కీటకాలు చేరకుండా ఉండాలన్నా... ఆవనూనెను విరివిగా వాడుతుంటాం. ఇవేకాదు, దీంతో అనారోగ్య సమస్యల్నీ నివారించవచ్చు అంటున్నారు నిపుణులు.డెస్క్ ఉద్యోగాలు చేస్తున్నవారికి గంటల కొద్దీ కూర్చొనే పని. దాంతో మెడ, కండరాలు, కీళ్ల నొప్పులతో ఎక్కువగా బాధపడుతుంటారు. అలాంటి వాళ్లు నొప్పి ఉన్నచోట ఆవనూనె రాసి, వృత్తాకారంలో మసాజ్ చేస్తే ఉపశమనం లభిస్తుంది.ఆవనూనెలో ఉండే ఎ, ఈ, కె విటమిన్లు చర్మసమస్యలకూ చెక్ పెడతాయి. చర్మం పొడిబారడం, పొలుసులు రావడం వంటి సమస్యలున్నవారు స్నానం తర్వాత దీన్ని రాసుకుంటే సహజనూనెలు కోల్పోకుండా కాపాడుతుంది.ఈ నూనెతో మసాజ్ చేయడం వల్ల ఒత్తిడీ, ఆందోళనా దూరమవుతాయి. దాంతో మంచి నిద్ర పడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

# ఈ నిద్రా భంగిమే మంచిదట!

కబురు న్యూస్, డెస్క్ జనవరి 29..



మనలో చాలామందికి బోర్లా, వెల్లకిలా పడుకోవడం అలవాటు! కానీ ఈ రెండింటి కంటే ఎడమవైపుకి తిరిగి పడుకోవడమే మంచిదని చెబుతోంది ఆయుర్వేద శాస్త్రం. అలాగే దీనివల్ల భవిష్యత్తులో మెదడు సంబంధిత సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తపడచ్చని ఓ అధ్యయనంలో కూడా రుజువైంది. ఇదే కాదు.. ఏ వయసు వారికైనా ఈ నిద్రా భంగిమే మంచిదని, దీనివల్ల ఆరోగ్యపరంగా బహుళ ప్రయోజనాలు చేకూరతాయని నిపుణులు చెబుతున్నారు. మరి, అవేంటో తెలుసుకుందాం రండి..

## జీర్ణవ్యవస్థకు మేలు!

జీవక్రియలన్నీ సజావుగా జరగాలంటే జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండడం ముఖ్యమని చెబుతుంటారు నిపుణులు. అయితే ఎడమవైపుకి తిరిగి పడుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుందంటున్నారు. అదెలాగంటే.. మనం తిన్న ఆహారం జీర్ణం కాగా మిగిలిన వ్యర్థాలు, టాక్సిన్లు మొదట పెద్ద పేగు ప్రారంభ భాగమైన సెకమ్లోకి చేరతాయి. అది మన శరీరంలో కుడివైపు ఉంటుంది. ఆపై ఇవి క్రమంగా మన శరీరానికి ఎడమవైపు ఉన్న పెద్ద పేగు చివరి భాగమైన పురీష నాళంలోకి వెళ్తాయి. మనం ఎడమవైపు తిరిగి పడుకున్నప్పుడు.. గురుత్వాకర్షణ కారణంగా కుడి నుంచి ఎడమకు ఈ వ్యర్థాలన్నీ సులభంగా కిందికి వెళ్లిపోతాయి. తద్వారా ఉదయాన్నే ఈ వ్యర్థాలన్నీ మలం రూపంలో బయటికి వెళ్లిపోవడం కూడా సులువవుతుంది. ఇలా పెద్ద పేగు ఎప్పటికప్పుడు పూర్తిగా ఖాళీ అవడం వల్ల పేగుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది పొట్ట ఆరోగ్యానికి, జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపరచడానికీ దోహదం చేస్తుంది. అందుకే రాత్రి పడుకునేటప్పుడైనా, కాస్త విశ్రాంతి తీసుకునేటప్పుడైనా.. ఎడమవైపుకి తిరిగి పడుకోవడమే మేలంటున్నారు నిపుణులు.



## గుండె ఆరోగ్యానికీ..!

ఈ మధ్య మహిళల్లోనూ గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందుకు ముఖ్య కారణం.. అనారోగ్యకరమైన ఆహారపుటలవాట్లు, ఒత్తిడి-ఆందోళన వంటి మానసిక సమస్యలే! అయితే ఇలాంటి సమస్యలు తలెత్తకుండా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడంలో మన నిద్రా భంగిమ కూడా కీలకమే అంటున్నారు నిపుణులు. అది కూడా ఎడమవైపుకి తిరిగి నిద్రపోవడం మంచిదంటున్నారు. ఎందుకంటే.. మన శరీరంలో గుండె ఎడమ వైపుకి ఉంటుంది. మనం ఇదే దిశలో పడుకున్నప్పుడు గురుత్వాకర్షణ కారణంగా రక్తం సులభంగా గుండెకు సరఫరా అవుతుంది. తద్వారా గుండెపై ఒత్తిడి కాస్త తగ్గుతుంది. ఫలితంగా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.

## గర్భిణులకు మేలు!

రోజురోజుకీ పెరిగే పొట్ట కారణంగా పడుకోవడానికీ ఇబ్బంది పడుతుంటారు గర్భిణులు. ఇలాంటప్పుడు ఎడమ వైపుకి తిరిగి పడుకోవడం వల్ల సౌకర్యంగా ఉండడంతో పాటు ఈ నిద్రా భంగిమ ఇటు మీకు, అటు మీ కడుపులోని బిడ్డ ఆరోగ్యానికీ మేలు చేస్తుందని చెబుతున్నారు నిపుణులు. అదెలాగంటే.. ఎడమ వైపుకి తిరిగి పడుకోవడం వల్ల వీపు, నడుము, వెన్నెముకపై ఒత్తిడి తగ్గుతుందట! తద్వారా నిద్ర చక్కగా పడుతుంది. అలాగే గర్భాశయానికి, పిండానికి రక్తప్రసరణ మెరుగవుతుంది. ఫలితంగా కడుపులో ఎదిగే బిడ్డకు పోషకాలు కూడా సులభంగా అందుతాయట! ఇలా తల్లీబిడ్డల ఆరోగ్యానికి మేలు చేసే ఈ భంగిమలో పడుకున్నప్పుడు.. కాళ్లు కాస్త ముడుచుకొని.. కాళ్ల మధ్యలో చిన్న దిండు పెట్టుకుంటే పొట్టపై ఒత్తిడి పడకుండా, సులభంగా నిద్రలోకి జారుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. ఇక ఈ భంగిమలో మరింత సౌకర్యంగా నిద్ర పోవాలంటే.. ప్రెగ్నెన్సీ పిల్లోస్ కూడా మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిని ప్రయత్నించచ్చు.

## ఆయాసం దూరం!

ఒక్కోసారి మనకు తెలియకుండానే అతిగా తినేస్తుంటాం. ఆపై ఆయాస పడుతుంటాం. అయితే ఇలాంటప్పుడు ఓ పది నిమిషాలు ఎడమవైపుకి తిరిగి పడుకోవడం వల్ల సమస్య నుంచి కొంతవరకు ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు. అదెలాగంటే.. ఈ భంగిమలో ఉన్నప్పుడు జీర్ణవ్యవస్థలోని పాంక్రియాటిక్ ఎంజైమ్స్ సమర్థంగా పనిచేసి ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడంలో తోడ్పడతాయట! తద్వారా ఆయాసం నుంచి కాస్త ఉపశమనం పొందచ్చంటున్నారు.

## గురక పెడుతున్నారా?

పురుషుల్లోనే కాదు.. కొంతమంది మహిళల్లోనూ ఈ లక్షణం కనిపిస్తుంది. అధిక బరువు, సైనస్.. వంటి సమస్యలున్న వారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుంటుంది. నిజానికి ఇది ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదంటున్నారు నిపుణులు. దీనివల్ల సుఖ నిద్ర పట్టకపోగా.. భవిష్యత్తులో రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలకూ దారితీయచ్చంటున్నారు. కాబట్టి ఎడమవైపు లేదా కుడివైపుకి తిరిగి పడుకోవడం వల్ల శ్వాస తీసుకోవడం మెరుగుపడి.. ఫలితంగా గురక సమస్యనూ తగ్గించుకోవచ్చంటున్నారు.

ఎడమవైపుకి తిరిగి పడుకోవడం ఆరోగ్యానికి మంచిదే అయినా.. ఎప్పుడూ ఒకే భంగిమలో పడుకోలేం. అలాంటప్పుడు ఎక్కువ సమయం ఎడమవైపుకి తిరిగి పడుకునేలా.. ఉపశమనం కోసం అప్పుడప్పుడూ కాసేపు కుడివైపు, వెల్లకిలా పడుకునేలా చూసుకుంటే శరీరం బిగుసుకుపోకుండా జాగ్రత్తపడచ్చు. తద్వారా శారీరక నొప్పులు రాకుండా కూడా చూసుకోవచ్చు.

# వయసు పెరిగే కొద్దీ ఆరోగ్యంగా.. ఇలా!

కబురు న్యూస్, డెస్క్ జనవరి 29..

వయసు పెరిగే కొద్దీ వివిధ రకాల అనారోగ్యాలు చుట్టుముడుతుంటాయి. మధుమేహం, అధిక బరువు, హార్మోన్లలో మార్పులు, యాంగ్జైటీ, డిప్రెషన్.. వంటివి వాటిలో కొన్ని. అయితే ఇవి దరిచేరకుండా ఆరోగ్యంగా ఉండాలంటే.. ఈ పదార్థాల్ని రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలంటున్నారు నిపుణులు.


## చేపలు

చేపల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ కొవ్వులు ఎక్కువసేపు కడుపు నిండుగా ఉండేలా చేస్తాయి. అంతేకాదు మెదడు, గుండె పనితీరును మెరుగుపరుస్తాయి. సాధారణంగా మెనోపాజ్ దశలోకి ప్రవేశించిన మహిళల్లో వేడి ఆవిర్లతో పాటు రాత్రి సమయాల్లో చెమట పట్టడంతో అసౌకర్యంగా ఫీలవుతుంటారు. ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉండే చేపలను ఆహారంలో భాగం చేసుకుంటే ఇలాంటి సమస్యల నుంచి ఉపశమనం పొందచ్చు.




## చిరుధాన్యాలు

నియాసిన్, రైబోఫ్లేవిన్, విటమిన్-ఇ.. వంటి పోషకాలు అధికంగా ఉండే చిరుధాన్యాలతో ఆరోగ్యమే కాదు మానసిక ఒత్తిళ్లు, ఆందోళనలు కూడా దూరమవుతాయి. శరీర బరువును అదుపులో ఉంచే ఫైబర్తో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు కూడా ఇందులో సమృద్ధిగా లభిస్తాయి.



## క్యారట్

విటమిన్-ఎ పుష్కలంగా దొరికే క్యారట్లు చర్మాన్ని మృదువుగా మారుస్తాయి. నల్లమచ్చలు, ముడతలు, మొటిమలు.. లాంటి సమస్యలకు చెక్ పెడతాయి. ఇవి వయసు పెరిగే కొద్దీ వచ్చే కంటి సమస్యల్నీ దూరం చేస్తాయి.

## యాపిల్

అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉండే యాపిల్ను సూపర్ ఫుడ్గా పరిగణిస్తాం. ఇందులో సి, బి, కె విటమిన్లుబీ ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. యాపిల్లోని పీచు పదార్థం కారణంగా అజీర్తి సమస్యలు దూరమవుతాయి. జీర్ణక్రియ రేటు వేగవంతమవుతుంది.

## పెరుగు

పెరుగులో ప్రొ-బయోటిక్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి దోహదం చేస్తాయి. అలాగే ఇందులో అధిక మొత్తంలో లభించే ప్రొటీన్, విటమిన్ 'ఎ', జింక్... వంటి పోషకాలు శరీరానికి అవసరమైన శక్తినిస్తాయి.

# సైకలాజికల్ ప్రపంచంలోకి కంగన

కబురు సినిమా జనవరి 29:
ఎన్నో సవాళ్లు ఎదురైనా ఎట్టకేలకు 'ఎమర్జెన్సీ' సినిమాతో ఇటీవలే ప్రేక్షకులను పలకరించింది బాలీవుడ్ కథానాయిక కంగనా రనౌత్. ఇప్పుడీ ఉత్సాహంలోనే ఆమె మరో కొత్త ప్రాజెక్టును పట్టాలెక్కించింది. విలక్షణ నటుడు ఆర్.మాధవన్, కంగన ప్రధాన పాత్రల్లో ఓ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. విజయ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని ఆర్ రవీంధన్ నిర్మిస్తున్నారు. సైకలాజికల్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాని ప్రకటించి రెండేళ్లు కావొస్తున్నా.. ఇప్పటికీ చిత్రీకరణకు నోచుకోలేదు. తాజాగా ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించినట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదిగా ఓ పోస్ట్ పెట్టింది కంగన. మరోవైపు ఆమె, మాధవన్ కాంబినేషన్‌లో 'తను వెడ్స్ మను 3' కూడా రూపొందుతుంది.



# మార్చిలో 'రామాయణ'లోకి..

కబురు న్యూస్, సినిమా జనవరి 29:


యశ్

కథానాయకుడు యశ్ నుంచి రానున్న పాన్ ఇండియా చిత్రాల్లో 'రామాయణ' ఒకటి. నితేశ్ తివారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్.. సీతగా సాయిపల్లవి నటిస్తున్నారు. యశ్ ఇందులో రావణుడిగా నటించడమే కాకుండా నమిత్ మల్హోత్రాతో కలిసి స్వయంగా నిర్మించనున్న సంగతి తెలిసిందే. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కోసం యశ్ మార్చి నుంచి రంగంలోకి దిగనున్నారని సమాచారం. లంక నేపథ్యంలో వచ్చే సోలో సన్నివేశాలతో ఆ షెడ్యూల్ మొదలవుతుందని తెలిసింది. దీనికోసం చిత్ర బృందం కొన్ని ప్రత్యేక సెట్లను సిద్ధం చేయిస్తోంది . ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. తొలి భాగం వచ్చే ఏడాది దీపావళికి తెరపైకి వస్తుంది. రెండో భాగం 2027 దీపావళికి విడుదల కానుంది. ఇక ప్రస్తుతం యశ్ – గీతూ మోహన్ దాస్ కాంబోలో రూపొందుతున్న 'టాక్సిక్' శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది.

# అలాంటి సినిమాలే నాకు ఇష్టం.. గేరు మార్చాలి అంటున్న రాశీఖన్నా



కబురు సినిమా జనవరి 29:
టాలీవుడ్ క్రేజీ బ్యూటీ రాశి ఖన్నా.. ఊహలు గుసగుసలాడే సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది ఈ బబ్లీ బ్యూటీ. రాశీ ఖన్నా తెలుగులో వరుసగా సినిమాలు చేసింది. యంగ్ హీరోలకు జోడీగా నటిస్తూ దూసుకుపోయింది ఈ అమ్మడు. అలాగే తమిళ్ లోనూ ఛాన్స్ లు అందుకుంది. తెలుగులో స్టార్ హీరో ఎన్టీఆర్ నటించిన జై లవ కుశ సినిమాలోనూ నటించింది. కానీ ఈ అమ్మడు అంతగా అవకాశాలు రావడం లేదు. దాంతో ఇటీవలే బాలీవుడ్ లో ఓ వెబ్ సిరీస్ చేసింది. దాంతో ఇప్పుడు బాలీవుడ్ పైనే ఈ చిన్నది ఫోకస్ పెడుతుంది. దాంతో రాశీ ఖన్నా టాలీవుడ్ కు దూరం అవుతుంది అని అంటున్నారు కొందరు అభిమానులు. కానీ ఈ అమ్మడు అవకాశం వస్తే ఏ బాషలోనైనా నటించి మెప్పిస్తాను అంటుంది.ప్రస్తుతం యంగ్ బ్యూటీస్ వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. వారికి గట్టిపోటీ ఇచ్చేలా రాశీ ఖన్నా కూడా గగ్లామర్ గేట్లు ఎత్తేసి కవ్విస్తుంది. ఈ మధ్య కాలంలో రాశిఖన్నా పోస్ట్ చేస్తున్న ఫోటోలు చూస్తే కుర్రకారుకు నిద్ర పట్టడం లేదు. ఆ రేంజ్ లో అందాలతో అదరగొడుతుంది ఈ ముద్దుగుమ్మ. ఇదిలా ఉంటే తాజగా రాశిఖన్నా చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. కమర్షియల్ చిత్రాలు మాత్రమే కంటెంట్ ఉన్న సినిమాల్లోనటించడం తనకు ఇష్టమని చెప్పుకొచ్చింది రాశీ ఖన్నా.ఈ ముద్దుగుమ్మ మాట్లాడుతూ.. 'నాకు కమర్షియల్ సినిమాలంటే చాలా ఇష్టం. కమర్షియల్ సినిమాలంటే వెంటనే ఓకే చెప్పేస్తా.. కానీ అలాంటి చిత్రాలు చేయడానికి ఇంకా చాలా సమయం ఉంది. అలాంటి ఆఫర్స్ వస్తూనే ఉంటాయి. నేను నటిగా ఎదగాలని ఎప్పటినుంచో కోరుకుంటున్నా.. మంచి కంటెంట్ ఉన్న సినిమాల్లో అవకాశం వస్తే ఆ సినిమానే మన ఎదుగుదలకు కారణం అవుతుంది. నటిగా నన్ను నేను నిరూపించుకోవడానికి మరో అవకాశం దక్కుతుంది. అలాంటి సినిమాలు ఎక్కువగా చేయాలని కోరుకుంటున్నా. చాలా కాలంగా సౌత్‌లో సినిమాలు చేస్తున్నా.. కానీ అలాంటి చిత్రాలే హిందీలో చేస్తే ఎలాంటి ఎగ్జైయిట్‌మెంట్ ఉండదు అని రాశిఖన్నా చెప్పుకొచ్చింది..

# అగ్ని నుంచి పుట్టిన ప్రేమే ఇది!

కబురు సినిమా జనవరి 29:
ప్రేమకథలు యాక్షన్, కామెడీ డ్రామాలతో సినీ ప్రియులను మెప్పిస్తున్న కథానాయకుడు ధనుష్. ఇప్పుడాయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'తేరే ఇష్క్ మే'. ప్రేమకథా నేపథ్యంలో ఆనంద్ ఎల్ రాయ్ తెరకెక్కిస్తున్నారు. గతంలోనే ఈ సినిమాను ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాలో కథానాయిక ఎవరనే విషయంపై స్పష్టతనిచ్చింది చిత్రబృందం. ఇందులో కథానాయికగా కృతి సనన్‌ను అధికారికంగా ప్రకటిస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా చిత్ర గ్లింప్స్‌ను పంచుకుంది చిత్రబృందం. "కొన్ని ప్రేమకథలు అగ్ని నుంచి పుట్టుకొస్తాయి" అనే వ్యాఖ్యను జోడించింది. టీ సిరీస్ పతాకంపై భూషణ్ కుమార్ నిర్మిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమా నవంబరు 28న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# ఆద్యంతం అలరించే.. రాజా

కబురు సినిమా జనవరి 29:



'మదగజరాజా' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించనున్నారు కథానాయకుడు విశాల్ . ఆయన.. అంజలి, వరలక్ష్మి శరత్ కుమార్ నాయకా నాయికలుగా నటించిన ఈ సినిమాని సుందర్.సి తెరకెక్కించారు. జెమినీ ఫిల్మ్ సర్క్యూట్ సంస్థ నిర్మించింది. సంక్రాంతి సందర్భంగా తమిళంలో విడుదలైన ఈ చిత్రాన్ని.. ఈ నెల 31న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది సత్యకృష్ణన్ ప్రొడక్షన్స్ సంస్థ. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా నటి అంజలి మాట్లాడుతూ.. "ఇది మంచి కమర్షియల్ సినిమా. విశాల్ యాక్షన్, సంతానం కామెడీ, సుందర్ దర్శకత్వంతో చాలా కలర్‌ఫుల్‌గా ఉంటుంది. ఇందులో నేను చేసిన పాత్రను ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా తమిళంలో పెద్ద హిట్టయ్యింది. తెలుగు ప్రేక్షకులకి కూడా కచ్చితంగా నచ్చుతుందని నమ్ముతున్నా" అన్నారు. "ఇది మంచి ఎంటర్‌టైనర్. ఆద్యంతం అలరిస్తుంది. ప్రతి ఎపిసోడ్‌ని ప్రేక్షకులు బాగా ఆస్వాదిస్తారు" అంది నటి వరలక్ష్మి . నిర్మాత జెమిని కిరణ్ మాట్లాడుతూ.. "తమిళంలో లాగే ఈ సినిమా ఇక్కడ కూడా పెద్ద హిట్టవుతుందని నమ్ముతున్నా" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ ఆంటోని, ఛాయాగ్రహణం: రిచర్డ్ ఎం.నాథన్.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com